



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 241 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శనివారం 23 మే 2026 పేజీలు : 12 వెల : 2/-


### హీట్ వేవ్‌పై

# రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

**ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నచోట స్థానికంగా సెలవుల ప్రకటన**

**రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో తీవ్రస్థాయిలో నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు, వడ గాల్పుల నేపథ్యంలో ప్రజారోగ్యం, వారి భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు నిరంతరం హెచ్చరికలు పంపాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించాలని దిశానిర్దేశం చేశారు. తీవ్రస్థాయి ఎల్ నినో కారణంగా హీట్ వేవ్ తీవ్రత కూడా మిగతా .. 2లో..

# ఏపీలో మండుతున్న ఎండలు..
# ఉక్కపోతతో హైదరాబాద్ ఉక్కిరిబిక్కిరి

**పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్లలో నిన్న 48 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత**

**తెలంగాణలో అత్యధిక జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**

**విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ వేడిమికి అనేక ప్రాంతాలు అగ్నిగుండంలా మారాయి. రానున్న రోజుల్లో మిగతా .. 2లో..



# మా బ్రాండ్ జాబ్ క్రియేషన్..
# మీ బ్రాండ్ గొడ్డలి

- దార్శనికత, నమ్మకం, వేగానికి ప్రతిరూపం “SAEL” సోలార్ ప్రాజెక్టు
- బ్రాండ్ సీబీఎన్ వల్లే ఆంధ్రప్రదేశ్ లో అభివృద్ధి పరుగులు
- క్లీన్ ఎనర్జీ వినియోగించడమే కాదు... దేశానికి ఎగుమతి చేస్తాం
- సేల్ సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో మంత్రి నారా లోకేష్

**జమ్మలమడుగు, విశ్వం వాయిస్ న్యూస్ :** నేడు కేవలం ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం మాత్రమే కాదు, దార్శనికత, నమ్మకం, వేగం, కార్యనిర్వహణ కలగలిసిన వేడుక అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం కొండాపురం మండలం టి.కొండూరు గ్రామంలో మిగతా .. 2లో..

# 'తప్పు జరిగింది.. మన్నించండి'..

**వేంకటేశ్వరుని కిరీటం మాయం వ్యవహారం కొలిక్కి**



**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణా జిల్లా గుడివాడలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి కిరీటం మాయం వ్యవహారం కొలిక్కి వచ్చింది. తాకట్టు వ్యాపారి నుంచి కోటి రూపాయల స్వర్ణ కిరీటాన్ని దేవస్థానం కమిటీ సభ్యులు విడిపించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంగణంలో మీడియా ఎదుట ప్రదర్శించారు. కిరీటానికి సంప్రోక్షణ చేసి స్వామివారికి అలంకరిస్తామని కమిటీ ఛైర్మన్ పోకూరి మోహనరావు మిగతా .. 2లో..

### పోక్సో కేసు నిందితుడిని

# 9 రోజులు దాచిపెట్టిందెవరు?

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోక్సో కేసు విషయంలో బండి భగీరథ్‌ను కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమ్మక్కయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రి అంటున్న రేవంత్.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి మళ్లీ ఎన్నికలకు సిద్ధమవ్వాలని సవాల్ విసిరారు. తాము కూడా రాజీనామా చేస్తామన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ధాన్యం కొనుగోళ్లు, బండి భగరథ్ కేసు సహా వివిధ అంశాలపై కేటీఆర్ మాట్లాడారు. “రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని రైతులే కాదు.. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ధర్నాలు చేస్తున్నారు. సీఎం సొంత నియోజకవర్గంలోనూ రైతులు నిరసన తెలిపారు. రాష్ట్రంలో 35 శాతానికి మించి ధాన్యం కొనుగోళ్లు జరగలేదు. ఏ విషయంలోనూ ప్రభుత్వానికి ప్రణాళిక లేకుండా పోయింది. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు దాదాపు 10 మంది ఉన్నారు. 45 డిగ్రీల ఎండలో మిగతా .. 2లో..

### పాస్టర్ అభినయ్ వ్యవహారం వెనుక

# ఎవరున్నారో తేలుస్తాం

**ఏపీ హోంమంత్రి అనిత**



**విశాఖ, విశ్వం వాయిస్ న్యూస్ :** పాస్టర్ అభినయ్ దర్శన్ వ్యవహారంపై ఏపీ హోంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంలో విచారణ కొనసాగుతోందని చెప్పారు. కుట్ర లేకపోతే అభినయ్ దర్శన్ కడప నుంచి అల్లూరి జిల్లాకు రావాల్సిన అవసరం ఏముందని మంత్రి ప్రశ్నించారు. ఆయన గిరిజనులను నమ్మించి పాస్టర్ అవతారం ఎత్తారని విమర్శించారు. అభినయ్ వ్యవహారంలో ఎవరెవరు ఉన్నారనేది త్వరలో బయటపడుతుందని చెప్పారు. ఆయన్ను కస్టడీకి తీసుకొని విచారణ చేస్తామని తెలిపారు. కడపకు చెందిన అభినయ్ దర్శన్‌పై అల్లూరి సీతారామరాజు జిల్లా జీకేవీధి మండల పరిధిలో దాడి, హత్యాయత్నం జరిగాయనే ప్రచారమంతా కట్టుకథేనని ఇటీవల పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దీని వెనుక కథ, మిగతా .. 2లో..

### వచ్చే నెలలో చంద్రబాబు, లోకేష్

# సింగపూర్ పర్యటన

**జూన్ 14 నుంచి 16 వరకు పర్యటన - వరల్డ్ సిటీస్ సమ్మిట్‌కు హాజరు**

**ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే పర్యటన లక్ష్యం**

**పలువురు పారిశ్రామికవేత్తలతో భేటీ కానున్న నేతలు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వచ్చే నెలలో సింగపూర్‌లో పర్యటించనున్నారు. సింగపూర్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు జూన్ 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ పర్యటన జరగనుంది. సింగపూర్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక ‘వరల్డ్ సిటీస్ సమ్మిట్’లో చంద్రబాబు, లోకేష్ పాల్గొంటారు. ఈ పర్యటనలో ప్రధానంగా రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి సారించనున్నారు. ఇందులో భాగంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపార దిగ్గజాలతో వారు సమావేశం కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వారికి వివరించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, మంత్రితో పాటు మిగతా .. 2లో..

### నీట్ పేపర్ లీక్.. మరో కీలక

# నిందితురాలి అరెస్టు




**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు తాజాగా మరో నిందితురాలిని అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే పుణెకు చెందిన బోటనీ లెక్చరర్ మనీషా మంధారేను అదుపులోకి తీసుకున్న సీబీఐ.. తాజాగా అదే ప్రాంతానికి చెందిన మనీషా సంజయ్ హవల్దార్ అనే మరో మహిళను అరెస్టు చేసింది. ఆమె పుణెలోని సేథ్ హీరాలాల్ సరాఫ్ కళాశాలలో పనిచేస్తున్నట్లుగా అధికారులు తెలిపారు. నీట్ పరీక్ష ప్రక్రియలో ఎక్స్‌పర్ట్‌గా ఉన్న మనీషాను ఫిజిక్స్ పేపర్‌ను లీక్ చేశారన్న మిగతా .. 2లో..

### పవన్‌ను బయటికి తీసుకురావాలన్న కుట్రలు మానండి...

# జగన్‌పై ముద్రగడ కుమార్తె క్రాంతి ఫైర్



- తమిళనాడులో కొత్త సీఎం విజయ్ మంచి సంప్రదాయం మొదలుపెట్టారని ప్రశంస
- ఏపీలో వైఎస్ జగన్ వల్లే శత్రుత్వ రాజకీయాలు పెరిగాయని విమర్శ

**విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీమంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి కుమార్తె, జనసేన పార్టీ నేత క్రాంతి.. వైసీపీ అధినేత జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడులో నెలకొన్న కొత్త రాజకీయ సంప్రదాయాన్ని ప్రస్తావిస్తూ, ఆంధ్రప్రదేశ్‌లో అందుకు భిన్నమైన పరిస్థితులు మిగతా .. 2లో..

# విద్యుత్‌ను పొదుపుగా వాడుకోండి : కేంద్ర విద్యుత్ శాఖ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఎండలు మండిపోతుండడంతో పగలు ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. అనేక ప్రాంతాల్లో వేడి గాలులు. దీంతో దేశంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి పెరిగింది. ఈ క్రమంలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ దేశ ప్రజలకు కీలక సూచనలు చేసింది. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని పేర్కొంది. ముఖ్యంగా పగటిపూట విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుందని.. విద్యుత్‌ను జాగ్రత్తగా వాడుకోవాలని ప్రజలను మిగతా .. 2లో..

### నా కుమారుడి పెళ్లికి

# హాజరైతే చంపేస్తారు : ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ వివాహానికి తాను హాజరుకాకపోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మిగతా .. 2లో..

# సింగపూర్‌లో కోవిడ్ కలకలం

**వారంలో 59% కేసుల పెరుగుదల**




**సింగపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** కొవిడ్-19.. సింగపూర్‌ను భయపెడుతోంది. ఈ నెల 10 నుంచి 16 మధ్య 12,700 కొత్త కేసులు ఆ దేశంలో నమోదయ్యాయి. అంతకుముందు వారంతో పోలిస్తే 58.8% పెరుగుదల. అంతేకాదు.. ఈ కాలంలో కొవిడ్ కారణంగా ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా భారీగా పెరగడం గమనార్హం. అంతకుముందర్ని రోజువారీ సంఖ్య 56 ఉండగా, అది 73కు పెరిగింది. అయితే ఎలాంటి మరణాలు సంభవించలేదని మిగతా .. 2లో..

### హార్ముజ్‌లో ‘టోల్’కు

# ఎవరూ అంగీకరించొద్దు : అమెరికా



**విశ్వం వాయిస్ న్యూస్ :** హార్ముజ్ జలసంధి మార్గంలో ఇరాన్ టోల్ వ్యవస్థను అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వస్తున్న వార్తలపై అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో స్పందించారు. ఈ చర్యలు చట్ట విరుద్ధమని, వీటిని ఏ దేశమూ అంగీకరించకూడదని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ నౌకారవాణా మార్గంలో రాకపోకలను నిర్ణయించే హక్కు ఏ దేశానికీ లేదన్నారు. ఎవరూ నౌకాయాన స్వేచ్ఛకు భంగం కలిగించలేరని పేర్కొన్నారు. అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛా నౌకాయానానికి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## మా బ్రాండ్ జాబ్ క్రియేషన్..

# మీ బ్రాండ్ గొడ్డలి

రూ. 3వేలకోట్లతో నిర్మించిన సుఖ్ బీర్ ఆగ్రో ఎనర్జీ లిమిటెడ్ వారి 600 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... "మా నాన్న ఉత్తరం రాశారు.. మా తాత కల కన్నారు.. నేను ఆత్మలతో మాట్లాడాను అంటే నమ్మే వాళ్ళు ఎవరు లేరు బ్రదర్. మా బ్రాండ్ జాబ్ క్రియేషన్... మీ బ్రాండ్ గొడ్డలి." రెండింటికీ ఎంతో తేడా ఉందని అన్నారు.

**రాష్ట్రం చూపు.. జమ్మలమడుగు వైపు**

మంత్రి లోకేష్ మాట్లాడుతూ రికార్డ్ టైమ్‌లో SAEL ప్రాజెక్ట్ పూర్తి అయింది. ఇది స్థానిక రైతుల విజయం, జమ్మలమడుగు యువత విజయం. మీ సహకారం వల్లనే ఈ ప్రాజెక్ట్ 11 నెలల్లో పూర్తి అయింది. రాష్ట్రం మొతం జమ్మలమడుగు వైపు చూస్తోంది. ఈరోజు ఇతర నియోజకవర్గాల వాళ్ళు మాకు కూడా ఇటువంటి కంపెనీలు వస్తే బాగుంటుంది అనుకుంటున్నారు. ఇక్కడ మెగా సోలార్ పార్క్ ఏర్పాటు చేసింది మనమే. ఇప్పుడు ర్యూజువా తీసుకువచ్చింది మనమే. అదానీ, చింతా గ్రీన్, జెన్‌కో – NTPC పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌లు తీసుకొచ్చింది మనమే. ర్యూజువా రావడం వల్ల రైతులకు లబ్ధి జరిగింది, యువతకు ఉద్యోగాలు వచ్చాయి. కంపెనీలు తీసుకురావాలన్నా, ఉద్యోగాలు కల్పించాలన్నా అది ఒక్క మన బ్రాండ్ సీబీఎన్ గారికి మాత్రమే సాధ్యమని అన్నారు.

**విజయానికి మూడు మెట్లు**

పెట్టుబడుల సాధన, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పనలో ఏపీ విజయానికి ముఖ్యమైన మూడు కారణాలున్నాయి. అవి ఏంటంటే.. మొదటిది బ్రాండ్ సీబీఎన్. "పెట్టుబడిదారులు ఇప్పుడు మేము ఎంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌కు రాగలం?" అని అడుగుతున్నారు. ఎందుకంటే, ఇచ్చిన మాటను చేతల్లో చూపే నాయకత్వంతో నిర్మితమైన ఆంధ్రప్రదేశ్ నేడు ఒక గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగింది. రెండవది స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. మేము స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను నమ్ముతాం. నిర్ణయాలు వేగంగా తీసుకుని, ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసినప్పుడే విధానాలకు విలువ ఉంటుంది. ఈ ప్రాజెక్టే అందుకు నిదర్శనం. ప్రాజెక్ట్ భూమిపూజ నుండి ప్రారంభోత్సవం వరకు రికార్డు స్థాయిలో 11 నెలల్లో పూర్తయింది. మూడవది డబుల్ ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ మద్దతుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం మరింత వేగవంతమైంది. మాది డబుల్–ఇంజిన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. రాష్ట్రప్రభుత్వ దార్శనికతకు కేంద్ర ప్రభుత్వ మద్దతు తోడైనప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుంది.

**ప్రపంచంతో పోటీపడే ఎకోసిస్టమ్ నిర్మాణం**

ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్, డ్రోన్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా, అధునాతన తయారీ వంటి రంగాల్లో 22 ప్రత్యేక గ్రోత్ క్లస్టర్లను నిర్మిస్తోంది. ఆధునిక ఆర్థిక వృద్ధి ఎకోసిస్టమ్స్, స్పెషలైజేషన్, ఆవిష్కరణల ద్వారానే సాధ్యమవుతుంది. ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వం కలిసి భవిష్యత్తు కోసం ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల ఎకో సిస్టమ్స్ ను నిర్మిస్తున్నాయి. SAEL నాయకత్వంతో మొట్టమొదటి సంభాషణ నాకు ఇప్పటికీ గుర్తుంది. ఢిల్లీలో ఒక టెలికాం ఆపరేటర్ల సంఘం సమావేశం సందర్భంగా జరిగింది. అది పునరుత్పాదక ఇంధనానికి సంబంధించిన సమావేశం కూడా కాదు. కానీ ఆరోజు ఆంధ్రప్రదేశ్‌లో పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను నిర్మించాలనే తమ ప్రణాళికల గురించి SAEL నాయకత్వం ఎంతో ఉద్వేగంగా మాట్లాడింది. వారి ఉద్దేశాన్ని నేను వెంటనే గ్రహించాను. రెన్యువబుల్ ఎనర్జీలో ఫలితాలను సాధించాలన్న SAEL సంస్థ దీర్ఘకాలిక ఆలోచన, వారి తపనను నేను పసిగట్టగలిగాను.

**స్థానిక సమాజంతో కలసి ముందడుగు**

పంజాబ్ లీడర్ షిప్ నేతృత్వంలో పనిచేస్తున్న ఢిల్లీకి చెందిన ఒక కంపెనీ ఆంధ్రప్రదేశ్ లో కార్యకలాపాలు నిర్వహించగలదా? అనే ప్రశ్న నాలో మెదిలింది. SAEL బృందం అమరావతికి వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని, నన్ను కలిశారు. క్షేత్రస్థాయిలో పనిచేయడానికి సిద్ధమై, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో రావడం నా ప్రశ్నకు జవాబు దొరికింది. SAEL బృందం చక్కగా స్థానిక సమాజం, ప్రజలతో మమేకమయ్యారు. క్షేత్రస్థాయిలో గ్రామస్థులు, రైతులు, స్థానిక యంత్రాంగం, ఇంజనీర్లు, కార్మికులు, అధికారులతో కలిసికట్టుగా పనిచేశారు. వారు క్షేత్రస్థాయికి వచ్చి, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని, స్థానికుల సహకారంతో ముందుకు సాగారు. ఆ స్ఫూర్తే ఈ ప్రాజెక్టును విజయవంతం చేసింది.

**రికార్డువేగంతో ప్రాజెక్టు పూర్తి**

SAEL రూ.3,000 కోట్ల పెట్టుబడి పెట్టి, 2,400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వీన్యూ1, వీన్యూ2 భారీ 300 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణం 11 నెలల్లో వేగవంతంగా పూర్తయి రికార్డు సృష్టించింది. పంజాబ్, రాజస్థాన్‌లోని SAEL సొంత ప్లాంట్లలో తయారైన 12 లక్షలకు పైగా అధునాతన టాప్‌కాన్ బైఫేషియల్ సోలార్ మాడ్యూల్స్ ఏర్పాటుచేశారు.

**11లక్షల టన్నుల కర్బన ఉద్గారాల తగ్గుదల**

ఈ ఒక్క ప్రాజెక్ట్ ద్వారానే ఏటా సుమారు 11 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను నివారించవచ్చని అంచనా. ఇక్కడ ఉత్పత్తి అయ్యే స్వచ్ఛమైన విద్యుత్, సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాతో కుదిరిన 25 ఏళ్ల విద్యుత్ కొనుగోలు ఒప్పందం ప్రకారం జాతీయ గ్రిడ్‌లోకి సరఫరా అవుతుంది. ఈ విద్యుత్ గుజరాత్‌తో సహా ఇతర రాష్ట్రాలకు కూడా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కేవలం క్లీన్ ఎనర్జీని వినియోగించడమే కాదు, భారతదేశానికి ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదుగుతోంది. భారతదేశ హరిత ఇంధన విప్లవానికి నాయకత్వం వహించడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉంది. ర్యూజువా బృందం మొత్తానికి, ముఖ్యంగా పంజాబ్ నుండి వచ్చిన మన సోదర సోదరీమణులకు నేను చెప్పేది ఒక్కటే. "తుస్సీ కమాల్ కర్ దిట్టా...చక్ దే ఫట్టే!" ఆంధ్రప్రదేశ్ మిమ్మల్ని కుటుంబ సభ్యులుగా స్వాగతిస్తోంది. క్రమశిక్షణ, పట్టుదల, వేగంతో ఎలా సాధించగలమో మీరు ఆచరణాత్మకంగా నిరూపించారు.

**నిర్మాణ సమయంలోనే వెయ్యిమందికి ఉపాధి**

ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 1,000 మందికి పైగా కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ–ఉపాధి లభించింది. వీరిలో 80 శాతం మంది స్థానికులే. వీరి ఆదాయాలు మెరుగయ్యాయి. చుట్టుపక్కల గ్రామాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తరించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా, దీర్ఘకాలిక లీజు ఒప్పందాల ద్వారా 760 మంది రైతులు, వారి కుటుంబాలు లబ్ధి పొందాయి.

**వ్యవసాయ వ్యర్థాల నుంచి విద్యుత్**

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ వ్యర్థాల నుండి దాదాపు 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేవి ర్యూజువా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇవి రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పిస్తాయి. పునరుత్పాదక ఇంధన రంగంలో ఇవి వేలాది ఉద్యోగాలను సృష్టిస్తాయి.

**మరిన్ని పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నాం**

SAEL బృందం వారి రాబోయే ఐపీవో ప్రయాణంలో, భారతదేశం అంతటా వారి భవిష్యత్ విస్తరణ ప్రణాళికలలో గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాం. నిరాటంకమైన కార్యకలాపాలు, భవిష్యత్ విస్తరణ కోసం మన స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలన్నీ పూర్తి మద్దతును కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ర్యూజువా సంస్థకు ఏ మద్దతు కావాలన్నా నేను ఒక్క వాట్సాప్ కాల్ దూరంలోనే ఉంటానని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా ఇన్ చార్జ్ మంత్రి సవిత, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, సేల్ (SAEL) కో–ఫౌండర్ & డైరెక్టర్ సుఖ్ భీర్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ & సీఈవో లక్షిత్ ఆవ్లా, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇంఛార్జ్ భూపేష్ రెడ్డి పాల్గొన్నారు.

## హీట్ వేవ్‌పై

# రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తత

గణనీయంగా పెరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేలా రద్దీగా ఉన్న ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల చల్లని మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. వడగాలుల నుంచి ఎలా రక్షించుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా నిరంతరం సమాచారాన్ని చేరవేయాలని నిర్దేశించారు. ప్రజల ప్రాణాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండ తీవ్రత నేపథ్యంలో బయటకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని సూచించారు. ఈ అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్లు, మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 1349 హీట్ షెల్టర్లు, చలి వేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు సీఎంకు వివరించారు. 446 ట్రాఫిక్ జంక్షన్లలో వాహనదారులు, పోలీసులకు నీడ కల్పించేలా ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. మరోవైపు ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్న మూగ జీవులు, పక్షులకు కూడా నీటి తొట్టెలు, మట్టి కుండలతో నీటిని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**పచ్చదనం పెంపుపై దృష్టి**

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగు నీటి కొరత రాకుండా చూడాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నీటి ఇబ్బందులు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. 2015లో బలమైన ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో 50.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డు అయ్యిందని.. ఈ ఏడాదిలోనూ ఎల్ నినో ప్రభావంతో ఇప్పటి వరకూ 48 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో నమోదు అయినట్టు అధికారులు వివరించారు. గడచిన మూడు రోజులుగా 45 డిగ్రీల నుంచి 48 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. భూగర్భ జలాలు పెరిగితే... పచ్చదనం పెరుగుతుందని... తద్వారా తీవ్ర ఉష్ణోగ్రతల ప్రభావం నుంచి కొంత మేర ఉపశమన లభిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. అన్నమయ్య జిల్లానే దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇతర జిల్లాలతో పోలిస్తే అన్నమయ్య జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదైందని స్పష్టం చేశారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాల్లో హెచ్చరికలు, అప్రమత్తత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమాచారం చేరవేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. వచ్చే వారం రోజుల పాటు నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, పురపాలక, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి, విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఏపీలో మండుతున్న ఎండలు.. ఉక్కపోతతో హైదరాబాద్ ఉక్కిరిబిక్కిరి

ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో వడదెబ్బ కారణంగా నిన్న 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావొద్దని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నిన్న పల్నాడు జిల్లాలో ఉష్ణోగ్రతలు 48 డిగ్రీలు దాటినట్లు వాతావరణ శాఖ తెలిపింది. పిడుగురాళ్ల వంటి చోట ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదయింది. బాపట్ల జిల్లా వేటపాలెం, ప్రకాశం జిల్లా అద్దంకి తదితర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలు నమోదయ్యాయి. ఏపీలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా, 150 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలో రోహిణికార్తె కంటే ముందే ఎండలు మండిపోతున్నాయి. ఈరోజు ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హన్మకొండ, రామగుండం, భద్రాచలం తదితర ప్రాంతాల్లో 44 డిగ్రీలస ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. హైదరాబాద్ నగర ప్రజలు వడగాలులు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. హైదరాబాద్ నగరంలో 42 నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైంది.

## పోక్సో కేసు నిందితుడిని

# 9 రోజులు దాచిపెట్టిందెవరు?

రైతులు పడిగాపులు కాస్తున్నారు. శనివారం జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ అంశమే ప్రధాన అజెండాగా ఉండాలి. ప్రభుత్వం ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలి. పోక్సో కేసులో నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరో చెప్పాలి. సామాన్యుడైతే పోలీసులు ఊరుకుంటారా? నిందితుడిని నిందితుడిగానే చూడాలి" అని కేటీఆర్ అన్నారు.

## పాస్టర్ అభినయ్ వ్యవహారం వెనుక

# ఎవరున్నారో తేలుస్తాం

స్క్రీన్‌ప్లే, దర్శకత్వమంతా ఆయనదేనని నిగ్గుతేలింది. తన కారుపై దాడి చేసినట్లు, తనను చంపేందుకు ప్రయత్నించినట్లు కొందరు వ్యక్తులతో అభినయ్ దర్శన్ నటింపజేసి, ఆ దృశ్యాల్ని చిత్రీకరించారు. వాటిని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తిచేసి, తనపై హత్యాయత్నం జరిగిందంటూ అభినయ్ పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లాలనే కుట్రలో భాగంగా ఈ డ్రామాను రక్తికట్టించారు. పోలీసులు దర్యాప్తు చేయడంతో 24 గంటల్లోనే గుట్టు రట్టైంది.

## వచ్చే నెలలో చంద్రబాబు, లోకేష్

# సింగపూర్ పర్యటన

రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొందరు సీనియర్ అధికారులు కూడా పాల్గొంటారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలక పెట్టుబడుల గమ్యస్థానంగా ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## పవన్‌ను బయటికి తీసుకురావాలన్న కుట్రలు మానండి...

# జగన్‌పై ముద్రగడ కుమార్తె క్రాంతి ఫైర్

ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె చేసిన ట్వీట్ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తమిళనాడులో కొత్తగా ముఖ్యమంత్రి అయిన విజయ్, ప్రతిపక్ష నేత స్టాలిన్ ఇంటికి వెళ్లి గౌరవించడం ద్వారా ఒక గొప్ప సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని క్రాంతి ప్రశంసించారు. ఒకప్పుడు శత్రుత్వ రాజకీయాలకు మారుపేరుగా ఉన్న తమిళనాట ఇప్పుడు మార్పు వచ్చిందని వెల్లడించార. గతంలో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో శత్రుత్వ రాజకీయాలు పెరిగిపోయాయని ఆమె ఆరోపించారు. ఒకప్పుడు ఏపీలో అధికార, ప్రతిపక్షాల మధ్య పరస్పర గౌరవం ఉండేదని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని విశ్లేషించారు. ఈ సందర్భంగా గత ఘటనలను ఆమె గుర్తుచేశారు. తమిళనాడు అసెంబ్లీలో జయలలితకు అవమానం జరిగినప్పుడు, ఆమె ముఖ్యమంత్రిగానే సభలో అడుగుపెడతానని శపథం చేసి నెరవేర్చుకున్నారని తెలిపారు. అదేవిధంగా, జగన్ పాలనలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును, ఆయన కుటుంబ సభ్యులను దారుణంగా అవమానించారని, దాంతో ఆయన కూడా 'ఈ కౌరవ సభ'లో అడుగుపెట్టనని శపథం చేసి, మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెట్టారని పేర్కొన్నారు. అయితే, జగన్‌కు ఎలాంటి అవమానం జరిగిందని ఇప్పుడు అసెంబ్లీకి వెళ్లడం లేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధిగా జీతం తీసుకుంటూ సభకు డుమ్మా కొట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. జగన్ తన ఓటమిని సమీక్షించుకోకుండా, కాపులను రెచ్చగొట్టడం, పవన్ కల్యాణ్‌ను కూటమి నుంచి ఎలా బయటకు తీసుకురావాలా అని కుట్ర రాజకీయాలు చేయడంపైనే దృష్టి పెట్టారని క్రాంతి ఆరోపించారు. ఇప్పటికైనా జగన్ ఇలాంటి రాజకీయాలు మాని, బాధ్యతగల ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని హితవు పలికారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఇంతకంటే ఘోరమైన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

# విద్యుత్‌ను పొదుపుగా వాడుకోండి : కేంద్ర విద్యుత్ శాఖ

కోరింది. మే 21న భారతదేశపు పగటిపూట గరిష్ట విద్యుత్ డిమాండ్ 270.82 గిగావాట్లతో గరిష్ఠ స్థాయికి చేరుకుందని విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తీవ్రమైన వేడి, ఉక్కపోత కారణంగా కరెంట్ వినియోగం వరుసగా నాలుగు రోజుల పాటు మునుపటి రికార్డులను బద్దలు కొట్టిందని పేర్కొంది. మే 18న పగటిపూట గరిష్ఠ డిమాండ్ 257.37 గిగావాట్లుగా ఉండగా.. మే 19న 260.45 గిగావాట్లకు చేరుకుందని తెలిపింది. మే 20న 265.44 గిగావాట్లు ఉండగా.. మే 21న 270.82 గిగావాట్లకు పెరుగుతూ అత్యధిక రికార్డులను నమోదు చేసినట్లు పేర్కొంది. ప్రతిరోజూ మధ్యాహ్నం 2–4 గంటల మధ్య ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండటంతో ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని విద్యుత్ మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల విద్యుత్ సరఫరా వ్యవస్థలు, గ్రిడ్ నిర్వహణపై ఒత్తిడి పెరిగి, విద్యుత్ డిమాండ్‌లో పెరుగుదల చోటు చేసుకుంటోందని పేర్కొంది. డిమాండ్‌లో ఈ భారీ పెరుగుదల ఉన్నప్పటికీ.. విద్యుత్ సరఫరా పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపింది. దేశవ్యాప్తంగా విద్యుత్ అవసరాలను తీర్చడానికి తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొంది.

## నా కుమారుడి పెళ్లికి

# హాజరైతే చంపేస్తారు : ట్రంప్

మారే అవకాశం ఉందని తెలిపారు. 48 ఏళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహమాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 ఏళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. అనంతరం మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

# సింగపూర్‌లో కోవిడ్ కలకలం

సింగపూర్ వైద్యవర్గాలు తెలిపాయి. ప్రస్తుత కొవిడ్ వేరియంట్ ఎన్‌బీ. 1.8.1పై వ్యాక్సిన్ సమర్థంగా పనిచేస్తాయని కూడా పేర్కొన్నాయి.

## హర్మూజ్‌లో 'టోల్'కు

# ఎవరూ అంగీకరించొద్దు : అమెరికా

రాజీ పడకూడదన్నారు. ఇటువంటి చర్యలు అమెరికా–ఇరాన్ శాంతి చర్చలను మరింత సంక్లిష్టం చేస్తాయన్నారు. కాగా హర్మూజ్‌ను దాటే నౌకల నుంచి రూ. 18 కోట్లు చొప్పున ఫీజులు వసూలుచేయడం మొదలుపెట్టినట్లు ఇరాన్ ప్రభుత్వ రంగ మీడియా ఇప్పటికే పేర్కొంది. ఇందులో భాగంగా నౌకల యజమానులు, అందులో ఉన్న సరకు, అవి చేరుకోవాల్సిన గమ్య స్థానాల గురించి పూర్తి సమాచారాన్ని తమ అధికారులకు ముందే అందించాల్సి ఉంటుందని తెలిపింది. హర్మూజ్‌పై నియంత్రణ సాధించడానికి.. యుద్ధం వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చడానికి ఈ టోల్ వసూలు చేయాల్సి వస్తోందని తెలిపింది. అయితే దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు.

# 'తప్పు జరిగింది.. మన్నించండి'..

తెలిపారు. కిరీటం తాకట్టు పెట్టలేదంటూ తొలుత కమిటీ సభ్యులు బుకాయించారు. మీడియా ఆధారాలు చూపించగా.. "కిరీటం వ్యవహారం మా కుటుంబ సమస్య.. మీడియాకు సంబంధం లేదు" అంటూ దౌర్జన్యానికి దిగారు. ఈ క్రమంలో వైశ్య సంఘాల పెద్ద జోక్యంతో వివాదం సద్దుమణిగింది. కల్యాణ మందిర నిర్మాణ నిధుల కోసమే కిరీటాన్ని తాకట్టు పెట్టినట్లు కమిటీ ఛైర్మన్ అంగీకరించారు. తప్పు జరిగిందని.. మన్నించాలని కోరారు. దాత కుటుంబంతో మాట్లాడి కిరీటం స్వామివారికి అలంకరిస్తామని చెప్పారు. జరిగిన తప్పును ఇక్కడితో వదిలేయాలని విజ్ఞప్తి చేశారు.

# మరో కీలక నిందితురాలి అరెస్టు

అభియోగంపై అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్‌లో నీట్ యూజీ 2026 ఫిజిక్స్ ప్రశ్నలను సహ నిందితురాలైన మనీషా మంధారేతో ఈమె షేర్ చేసుకున్నట్లుగా సీబీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. మే 3న జరిగిన నీట్ పరీక్ష లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా ఆందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 12న సీబీఐ అధికారులు కేసు నమోదు చేశారు. విచారణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మర దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు దిల్లీ, జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, లాతూర్, అహిల్యానగర్‌కు చెందిన మొత్తం 11 మందిని అరెస్టు చేసినట్లు సీబీఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

# ఎడిటర్ వాయిస్

## ఉండి.. వైసీపీలో ఏం జరుగుతోంది..?

నిజానికి ఉండి నియోజకవర్గంలో టీడీపీ హవా ఎక్కువగానే ఉంటుంది. తాజాగా ఇక్కడ నుంచి రఘురామ కృష్ణరాజువిజయం దక్కించుకున్నాక.. క్షత్రియ సామాజిక వర్గం మరింత ఎక్కువగా ఐకమత్యం చూపిస్తోం ది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి నియోజకవర్గంలో వైసీపీ రాజకీయాలు ఎలా సాగుతున్నాయి? గత ఎన్నికల సమయంలో పోటీ చేసిన పీవీఎల్ నరసింహరాజు ప్రస్తుతం ఏం చేస్తున్నారు? అసలు వాయిస్ వినిపిస్తున్నారా? అనే అంశాలు ఆసక్తిగా మారాయి. పార్టీ లోనే రాజుగారు ఉన్నప్పటికీ.. పార్టీ తరఫున కార్యక్రమాలు మాత్రం నిర్వహించలేక పోతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆయనకు అనుకూలంగా లేవని చెబుతున్నారు. నిజానికి ఉండి నియోజకవర్గంలో టీడీపీ హవా ఎక్కువగానే ఉంటుంది. తాజాగా ఇక్కడ నుంచి రఘురామ కృష్ణరాజువిజయం దక్కించుకున్నాక.. క్షత్రియ సామాజిక వర్గం మరింత ఎక్కువగా ఐకమత్యం చూపిస్తోంది. దీంతో రఘురామకే ఆ వర్గం జై కొడుతోంది. పైగా.. రఘురామ ఎప్పటికప్పుడు ఫైర్ బ్రాండ్ నాయకుడిగా దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి తోపాటు.. పార్టీ తరఫున కూడా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పరిణామాలు టీడీపీలో జోష్ పెంచుతున్నాయి.

అయితే.. విపక్ష నేతగా.. లేదా.. గత ఎన్నికల్లో పోటీ చేసిన నాయకుడిగా.. నరసింహరాజు తన గ్రాఫ్‌ను పెంచు కునేందుకు ప్రయత్నాలు చేయాల్సి ఉంది. కానీ.. ఆయన తన సొంత సామాజిక వర్గంపైనే అక్కసుతో ఉన్నారన్న వాదన వినిపిస్తోంది. గత ఎన్నికల్లో తనను గెలిపిస్తామని చెప్పిన నాయకులు తనకు హ్యాండిచ్చారని.. చాల నష్టపోయానని ఆయన వాపోతున్నారు. వాస్తవానికి రాజకీయాల్లో ఇవన్నీ కామనే. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇస్తారు. అవన్నీ అవుతాయా? అంటే కష్టమే.

అలానే.. అండగా ఉంటామని చెప్పిన వారంతా.. అండగా ఉండాలని ఏమీ లేదు. అయినా.. అందరినీ కలుపుకొని పోయి.. రాజకీయాలను సుస్థిరం చేసుకునే దిశగా అడుగులు వేయాల్సిన రాజు గారు..ఇప్పుడు.. రెండు సంవత్సరాలు గడిచిపోయినా.. ఇంకా అలక పాన్పు దిగలేదని అంటున్నారు. ఇక, పార్టీ తరఫున కార్యక్రమాలు కూడా నిర్వహించడం లేదు. పైగా.. పార్టీకార్యాలయానికి (తాడేపల్లి) వచ్చి.. ఇక్కడే తిష్టవేస్తున్నారని..



నియోజకవర్గంలో పర్యటించడం లేదన్నవాదన కూడా వినిపిస్తుండడం గమనార్హం. సో.. ఈ పరిణామాలతో ఉండి నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి దిగజారుతోందని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## నకిలీ ఇన్వాయిస్‌లతో రూ.100 కోట్ల గ్రానైట్ వ్యాపారం

**జీరో బిజినెస్‌తో రూ.16.96 కోట్ల జీఎస్టీ ఎగవేత – డీజీజీఐ దాడుల్లో భారీ సిండికేట్ బహిర్గతం**
**కరీంనగర్‌కు చెందిన దాసరి శ్రీకాంత్ అరెస్ట్ – ఘట్‌కేసర్‌లోని ఓ గ్రానైట్ దుకాణంలో అక్రమ సరకు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రూ.కోట్లలో వ్యాపారం నిర్వహించినప్పటికీ ఎలాంటి లావాదేవీలు జరగలేదని చూపుతూ పన్ను ఎగవేతకు పాల్పడిన కరీంనగర్‌కు చెందిన వ్యాపారి దాసరి శ్రీకాంత్‌ను జీఎస్టీ నిఘా విభాగం డీజీజీఐ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం హైదరాబాద్ నాంపల్లి ఆర్థిక నేరాల కోర్టులో హాజరుపరచడంతో న్యాయస్థానం అతడికి రిమాండ్ విధించినట్లు డీజీజీఐ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించింది. డీజీజీఐ రెండురోజులపాటు కరీంనగర్‌లో పలు గ్రానైట్ దుకాణాలు, ట్రాన్స్‌పోర్టర్ల కార్యాలయాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. ఈ క్రమంలో దాదాపు రూ.100 కోట్ల విలువైన గ్రానైట్‌ను బోగస్ సంస్థ పేరిట జనరేట్ చేసిన ఇన్వాయిస్‌లు, వేబిల్లుల ద్వారా తరలించినట్లు తేలింది. ఈ భారీ గ్రానైట్ సిండికేట్‌లో శ్రీకాంత్ కీలకపాత్ర పోషించినట్లు తేలింది. మనోజ్ ఎంటర్‌ప్రైజెస్ పేరిట బోగస్ సంస్థను ఏర్పాటు చేసి.. దాని ద్వారా రూ.100 కోట్ల గ్రానైట్‌ను రవాణా చేసినట్లు ఈ-వేబిల్లుల్ని జనరేట్ చేశాడు. అయితే, ఆ సరఫరాలను జీఎస్టీ రిటర్నుల్లో ఎక్కడా చూపలేదు. పన్ను చెల్లించలేదు. శ్రీకాంత్ నిర్వహించిన ఈ జీరో బిజినెస్ కారణంగా రూ.16.96 కోట్ల పన్ను ఎగవేత జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. మనోజ్ ఎంటర్‌ప్రైజెస్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీకాంత్ తన స్నేహితుడి బ్యాంకు ఖాతాను లింక్ చేసినట్లు తేలింది. అలాగే నకిలీ ఇన్వాయిస్‌లు, ఈ-వేబిల్లులు సృష్టించేందుకు భార్య మొబైల్ నంబర్‌ను వినియోగించినట్లు వెల్లడైంది. ఆ సంస్థ ప్రొప్రైయిటర్‌గా చూపించిన మనోజ్‌తారా అనే వ్యక్తి ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగి మాత్రమే అని తేలింది. తన పేరిట సంస్థ రిజిస్టర్ అయినట్లు అతడికి తెలియదని డీజీజీఐ దర్యాప్తులో బహిర్గతమైంది. ఈ సిండికేట్‌లో రాజస్థాన్‌కు చెందిన మరికొందరు శ్రీకాంత్‌తో పనిచేసినట్లు గుర్తించారు. అలాగే శేరిలింగంపల్లి, ఘట్‌కేసర్ ప్రాంతాల్లోని గ్రానైట్ దుకాణాల్లో అక్రమ సరకును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రజ్ఞాపూర్‌లో లారీల్లో తరలిస్తున్న గ్రానైట్ శ్లాబ్‌లనూ స్వాధీన పరచుకున్నారు. ఈ నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.


## విషాదం.. తండ్రీకుమారులైన ఆలయ అర్చకుల ఆత్మహత్య



**లింగాల గణపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జనగామ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అర్చకులుగా పనిచేస్తున్న తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నారు. గణపురం మండలం బండగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులుగా విధులు నిర్వహించే వరయోరు లక్ష్మీనరసింహాచార్యులు, ఆయన కుమారుడు పవన్‌కుమార్ ఆచార్యులు బలవన్మరణానికి పాల్పడినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆలయ కోనేరులో పడి మృతిచెందినట్లు చెప్పారు. లక్ష్మీనరసింహాచార్యుల భార్య శ్రీదేవి నెల క్రితం అనారోగ్యంతో చనిపోవడం, ఆర్థిక ఇబ్బందులు తదితర కారణాలతో తండ్రీకుమారులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఘటనాస్థలాన్ని డీసీపీ రాజమహేంద్ర నాయక్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## నడిరోడ్డుపై జీపులతో ఢీకొట్టుకుంటూ.. బెజవాడలో యువకుల బీభత్సం

**భయాందోళనలతో ప్రజల పరుగులు – యువతి వ్యవహారంలో మనస్పర్ధలే గొడవకు కారణం**



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్ననాటి నుంచి స్నేహితులైన ఇద్దరు యువకులు ఓ యువతి వ్యవహారంలో తలెత్తిన మనస్పర్ధలతో నడిరోడ్డుపై వాహనాలతో ఢీ కొట్టుకుంటూ యాక్షన్ సీన్ సృష్టించారు. అవి ధ్వంసమైనా కసి తీరక వాహనాల్లో నుంచి దిగి కలియబడ్డారు. విజయవాడ నగర నడిబొడ్డున హైటెన్షన్ రోడ్డులో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన లింగమనేని రోహిత్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. విజయవాడలోని భారతీనగర్‌కు చెందిన బొల్లా ఓమ్ తండ్రితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చూసుకుంటున్నాడు. ఇతను వైకాపా నేత జోగి రమేష్‌కు బంధువుగా చెప్పుకొనేవాడని తెలిసింది. జగన్ పుట్టినరోజున కూడా తాడేపల్లిలో వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించాడు. చిన్ననాటి నుంచి స్నేహితులైన ఓమ్, రోహిత్‌ల మధ్య ఓ యువతి వ్యవహారంలో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఓమ్.. రోహిత్‌కు ఫోన్ చేసి ఎక్కడున్నావని అడిగాడు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. తాను పటమట ఆర్ఆర్ గార్డెన్‌లోని హైటెన్షన్ రోడ్డులో ఉన్నానని రోహిత్ చెప్పాడు. దీంతో ఓమ్ గురువారం రాత్రి థార్ జీప్‌పై అక్కడికి వెళ్లి రోహిత్ జీప్‌ను ఢీ కొట్టాడు. ఆగ్రహంతో ఇద్దరూ రోడ్డుపైనే పలుసార్లు ఒకరి వాహనాన్ని మరొకరు బలంగా ఢీ కొట్టుకుంటూ.. 100 మీటర్లు రోడ్డుపై ఈడ్చుకు వెళుతూ హడావుడి చేశారు. దీంతో రోడ్డుపై వెళుతున్నవారు భయాందోళనలతో పరుగులు తీశారు. అప్పటికీ ఇద్దరూ వెనక్కి తగ్గలేదు. జీప్‌లు దిగి రాడ్లతో ఒకరి కారు అద్దాలు ఒకరు పగలగొట్టుకున్నారు. పటమట పోలీసులు వచ్చేసరికి జీప్ వదిలేసి రోహిత్ పరారయ్యాడు. ఓమ్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లి విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కిషోర్ తెలిపారు. గొడవ జరిగినప్పుడు ఒకరి వాహనంలో ఓ యువతి, మరో వాహనంలో కొందరు యువకులు ఉన్నట్లు తెలిసింది.

## కంటెయినర్‌లో మంటలు.. 8 కార్లు దగ్ధం

**మెదక్ జిల్లా తూప్రాన్ శివారులో ఘటన**



**తూప్రాన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కంటెయినర్‌తోపాటు అందులో ఉన్న కార్లు దగ్ధమైన ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ శివారులో 44వ జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్‌పుర్ నుంచి ఏపీలోని కాకినాడకు ఓ కంటెయినర్ లారీలో 8 కొత్త కార్లను తీసుకెళ్తున్నారు. తూప్రాన్ శివారులోకి రాగానే లారీ ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయి. డ్రైవరు గమనించి అప్రమత్తమై పక్కకు నిలపగా.. నిమిషాల వ్యవధిలోనే కంటెయినర్ క్యాబిన్‌లో మంటలు చెలరేగి, వెనక భాగంలోని కార్లకు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో రామాయంపేట అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే అందులోని కార్లు పూర్తిగా కాలిపోయాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.


**శ్రీకాకుళం హోటల్‌లో**

## పల్నాడు జిల్లా యువతి ఆత్మహత్య

**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న ఓ హోటల్‌లో యువతి ఆత్మహత్య చేసుకుంది. గదిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆధార్ వివరాల ప్రకారం మృతురాలిని పల్నాడు జిల్లాకు చెందిన కస్తూరి కుమారి బెహరా (23)గా గుర్తించారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా గది బుక్ చేసుకున్న యువతి.. గురువారం ఉదయం హోటల్‌లో దిగింది. శుక్రవారం ఉదయం హౌస్ కీపింగ్ సిబ్బంది డోర్ కొట్టినా స్పందించలేదు. అనంతరం ఆమె ఉరివేసుకున్నట్లు హోటల్ మేనేజర్, సిబ్బంది గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

**డిప్యూటీ కలెక్టర్ నివాసాల్లో ఏసీబీ సోదాలు..**

## రూ.వందల కోట్ల ఆస్తులు గుర్తింపు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడ్చల్ మల్కాజిగిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ నివాసాల్లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు రూ.వందల కోట్ల విలువైన ఆస్తులు గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన వంశీమోహన్.. భారీగా ప్రభుత్వ భూములు కాజేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురంలో 8 ఎకరాలు కాజేసినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. భూములను తన మామ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి.. ఆ తర్వాత రియల్టర్‌కు ధారాదత్తం చేసినట్టు అధికారులు గుర్తించారు. ఓ రియల్టర్ నుంచి 10 ప్లాట్లు గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్టు ఏసీబీ గుర్తించింది. దీంతో వంశీమోహన్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**జగదేవపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులు, కుమార్తె వివాహం కోసం చేసిన అప్పులు పెరిగాయి. పంటల దిగుబడులు ఆశాజనకంగా లేకపోవడంతో అప్పులు తీర్చే మార్గం తోచక మనస్తాపంతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం నిర్మల్‌నగర్‌కు చెందిన కర్రె మల్లేశం (48) తనకున్న నాలుగు ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అతనికి భార్య మంజుల, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గతఏడాది పెద్ద కుమార్తె వివాహం చేశారు. మూడేళ్లుగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులతో పత్తి, వరి పంటల దిగుబడులు సరిగా రాలేదు. ఈ నెల 10న వరి పంట కోత కోయించగా ధాన్యం దిగుబడి అనుకున్నంతగా రాలేదు. సుమారు రూ.10 లక్షల అప్పు తీర్చడానికి కొంత భూమి అమ్మాలని ప్రయత్నించినా కొనడానికి ముందుకు రాలేదు. మనస్తాపానికి గురైన మల్లేశం అదే రోజున పొలం వద్ద పురుగుమందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఏఎస్ఐ సుభాష్ తెలిపారు. రైతు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# షుగర్ కంట్రోల్ చేసే 5 అద్భుతమైన పండ్లు...



నేటి కాలంలో మన ఇంట్లో ఎవరినో ఒకరిని మధుమేహం (డయాబెటిస్) ఇబ్బంది పెడుతూనే ఉంది. ఆహారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, పండ్లు తినే దగ్గర మాత్రం చాలా మందికి ఒక రకమైన భయం ఉంటుంది. "పండ్లు తింటే షుగర్ లెవెల్స్ పెరిగిపోతాయేమో?" అని ఆగిపోతుంటారు. నిజానికి పండ్లలో ఉండే ఫైబర్, విటమిన్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, మనం గమనించాల్సింది 'గ్లైసెమిక్ ఇండెక్స్'. ఏ పండ్లయితే రక్తంలో చక్కెరను నిదానంగా విడుదల చేస్తాయో, వాటిని మనం నిరభ్యంతరంగా తినవచ్చు. అలాంటి 5 పండ్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**నిమ్మకాయ – ఆరోగ్యానికి శ్రీరామరక్ష:** నిమ్మకాయను మనం కేవలం రుచి కోసం ఉపయోగిస్తాం కానీ, దీని వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారికి ఇది ఒక వరం లాంటిది. నిమ్మరసంలో విటమిన్ సి అత్యధికంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని అద్భుతంగా పెంచుతుంది. మీరు తీసుకునే ఆహారంలో కొద్దిగా నిమ్మరసం చేర్చుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు త్వరగా పెరగవు. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ కేవలం 20 ఉండటం వల్ల ఇది డయాబెటిక్ డైట్‌లో అత్యంత సురక్షితమైనది. రోజువారీ అలసటను తగ్గించి, శరీరాన్ని ఉత్సాహంగా ఉంచడానికి నిమ్మరసం ఎంతో సహాయపడుతుంది.

**ఆపిల్ – మధుమేహులకు మంచి నేస్తం:** ఆపిల్ పండు చూడటానికి ఎర్రగా, తీయ్యగా ఉన్నా.. ఇది మధుమేహులకు చాలా మేలు చేస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ రక్త ప్రవాహంలో గ్లూకోజ్ నెమ్మదిగా కలిసేలా చేస్తుంది. ఆపిల్ తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉండటమే కాకుండా గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. చాలా మంది ఆపిల్ తొక్క తీసి తింటారు, కానీ తొక్కలోనే ఎక్కువ ఫైబర్ మరియు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. కాబట్టి శుభ్రంగా కడిగి తొక్కతో సహా తినడం వల్ల పూర్తి పోషకాలు అందుతాయి. షుగర్ ఉన్నవారు స్నాక్ సమయంలో ఒక చిన్న ఆపిల్ తినడం ఉత్తమమైన పద్ధతి.

**ఆరెంజ్ – సహజసిద్ధమైన శక్తి :** సిట్రస్ పండ్లలో ఆరెంజ్ ఒక సూపర్ ఫుడ్ లాంటిది. ఇందులో ఉండే ఫైబర్, విటమిన్ సి మరియు పొటాషియం రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడతాయి. నారింజ పండ్లలో ఉండే ఫ్లేవనాయిడ్స్ ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తాయి. అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి, ఆరెంజ్ జ్యూస్ కంటే పండును నేరుగా తినడమే మంచిది. ఎందుకంటే జ్యూస్ తీసినప్పుడు ఫైబర్ తగ్గిపోయి షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. అందుకే పండును తొనల రూపంలో తీసుకోవడం వల్ల రక్తంలో షుగర్ పెరగకుండా చూసుకోవచ్చు.

**బొప్పాయి – జీర్ణక్రియ మరియు షుగర్ నియంత్రణ:** బొప్పాయిలో విటమిన్ ఏ మరియు సీ పుష్కలంగా ఉంటాయి. ఇది కేవలం కంటికి మాత్రమే కాకుండా మధుమేహ నియంత్రణకు కూడా చక్కగా పనిచేస్తుంది. బొప్పాయిలో ఉండే ఎంజైమ్స్ జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. డయాబెటిస్ వల్ల చాలా మందికి చర్మ సమస్యలు లేదా గాయాలు త్వరగా మానకపోవడం వంటివి జరుగుతుంటాయి, బొప్పాయిలోని పోషకాలు ఈ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. దీని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ-మధ్యస్థ స్థాయిలో ఉంటుంది కాబట్టి రోజుకు ఒక చిన్న కప్పు బొప్పాయి ముక్కలు తీసుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు.

**జామకాయ – సామాన్యుడి ఆపిల్:** ధర తక్కువైనా ప్రయోజనాల్లో జామకాయే రారాజు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటంతో పాటు, ఇందులో ఫైబర్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలోని చక్కెరను గ్రహించి మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. జామకాయను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ఇన్సులిన్ నిరోధకత తగ్గుతుంది. అంతేకాకుండా ఇందులోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. మధుమేహ రోగులు మధ్యలో ఆకలి వేసినప్పుడు జామకాయను చిరుతిండిగా తీసుకోవడం వల్ల పొట్ట నిండిన అనుభూతి కలుగుతుంది మరియు అనారోగ్యకరమైన ఆహారం వైపు మనసు పోదు.



విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
శనివారం, 23 మే, 2026
4
www.viswamvoice.com



రాహుల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే

# తీవ్ర పరిణామాలు తప్పవు

**ఎస్ఐఆర్ చర్చకు ఎమ్మెల్యే నల్లమిల్లి సిద్ధమా? - తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బోడా వెంకట్ సవాలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కంబాలచెరువు మెగా ఫంక్షన్ హాల్ నందు జరిగిన పత్రిక సమావేశంలో కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసిన అనపర్తి బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా అధ్యక్షులు బోడ వెంకట్, ప్రధాన కార్యదర్శి ఆర్గనైజేషన్ పట్నాల శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జ్యేష్ఠ సతీష్ బాబు బహిరంగ సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో బోడా వెంకట్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ సంబంధించిన (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై దమ్ముంటే చర్చకు రావాలని కనీసం రాష్ట్రంలో 10సీట్లు కూడా గెలవని బిజెపి అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. ప్రధాన కార్యదర్శి పట్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ములాలు మర్చిపోరాదని కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు బిజెపికి లేదుని పేర్కొన్నారు. జ్యేష్ఠ సతీష్ బాబు మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి అనే మనిషి బిజెపిలో ఉంటూ ఆయన మనసంతా తెలుగుదేశం దేశం కోసం పనిచేస్తుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గంగిన రామ నాయుడు, చింతాడ వెంకటేశ్వరరావు, ఇజ్జరోతు సత్యనారాయణ, యళ్ల మాచరయ్య, మోర్తా అబ్బులు, చామంతి లీలావతి, గట్టి నవతార కేస్, రవి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భానుడి భగభగలకు

# బెంబేలెత్తిన జనాలు..

**రాత్రి చల్లని గాలులతో ఉపశమనం**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రోజంతా భానుడి భగభగలతో మండిపోయిన మండల ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఉదయం నుంచే ఎండలు ఎగసిపడటంతో రహదారులు నిర్మానుష్యంగా మారగా, అత్యవసర పనులకే ప్రజలు బయటకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్నానికి వేడి గాలులు వడగళ్లలా వీచడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. చల్లని గాలులు వీయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఎండల తీవ్రత తో ఉక్కిరిబిక్కిరైన జనాలకు ఈ చల్లని పవనాలు మంచి ఉపశమనాన్ని అందించాయి. కొంతమంది ఇళ్ల బయటకు వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించారు. "పగలు భగభగలు... రాత్రి చల్లని గాలులు" అంటూ ప్రజలు వాతావరణ మార్పుపై ఆనందం వ్యక్తం చేశారు.

# రక్త క్యాన్సర్ చికిత్సలో ఆధునిక వైద్యవిజ్ఞానంతో అద్భుత పురోగతి

**వైద్యరంగ విజయానికి నిదర్శనం యశోద హైటెక్ సిటీ హాస్పిటల్ చికిత్స**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ రక్త క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో రక్త క్యాన్సర్ చికిత్సలో ఆధునిక వైద్య విజ్ఞానంతో అద్భుత పురోగతిని సాధించామని నిపుణులు వెల్లడించారు. హాస్పిటల్ ఆధ్వర్యంలో హైదరాబాద్ హైటెక్ సిటీలో జరిగిన ఈ అత్యాధునిక చికిత్సలతో రోగులకు సరికొత్త జీవితం అందిస్తున్నామని వైద్యులు పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల క్రితం ప్రాణాంతక రక్త క్యాన్సర్ బారిన పడిన రాజమండ్రి యువకుడు ఉమా గంగాధర్ నచికేతు ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో జీవించడం వైద్యరంగ విజయానికి నిదర్శనమని తెలిపారు. కుటుంబ సభ్యుడి నుండి కేవలం సగం జన్యువు సరిపోలిక ఉన్న దాతతో నిర్వహించిన హాప్లోయిడెంటికల్ ఎముక మజ్జ మార్పిడి (బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ ) ద్వారా ఆయన వ్యాధిని జయించినట్లు వెల్లడించారు. యశోద హాస్పిటల్స్ సీనియర్ హెమటాలజిస్ట్ మరియు బీఎంటీ స్పెషలిస్ట్ డాక్టర్ గణేష్ జై సేత్వర్ మాట్లాడుతూ, ఒకప్పుడు రక్త క్యాన్సర్ అంటే భయాందోళనలకు గురిచేసే వ్యాధిగా భావించేవారని, కానీ ఇప్పుడు ఖచ్చితమైన వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఇమ్యునోథెరపీ, కార్-టి థెరపీ, టార్గెటెడ్ థెరపీ, అధునాతన ఎముక మజ్జ మార్పిడి వంటి చికిత్సలతో వివిధ రకాల రక్త క్యాన్సర్లలో 90 శాతం వరకు నివారణ సాధ్యమవుతోందన్నారు. క్యాన్సర్ కణాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుని పనిచేసే టార్గెటెడ్ థెరపీ మందులు ఆరోగ్యకరమైన కణాలకు నష్టం తగ్గిస్తాయని, ఇమ్యునోథెరపీ మరియు కార్-టి థెరపీ శరీర రోగనిరోధక శక్తిని పెంచి క్యాన్సర్‌పై సమర్థవంతంగా పోరాడేలా చేస్తాయని వివరించారు. ప్రతి రోగి క్యాన్సర్ స్వభావం భిన్నంగా ఉండటంతో వ్యక్తిగతీకరించిన చికిత్సలు మరింత మెరుగైన ఫలితాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. పరిపూర్ణ దాత లభించని సందర్భాల్లో కుటుంబ సభ్యుల నుండి సగం సరిపోలిన దాతతో కూడా విజయవంతంగా ఎముక మజ్జ మార్పిడి చేయగలగడం వైద్యరంగంలో కీలక మైలురాయిగా అభివర్ణించారు. ఈ విధానాలు రోగులకు పునర్జన్మ లాంటి అవకాశాన్ని అందిస్తున్నాయని నిపుణులు చెప్పారు. భారతదేశంలో ప్రతి 20 సెకన్లకు ఒకరు రక్త క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో ముందస్తు గుర్తింపు, సకాలంలో వైద్యం, ప్రపంచస్థాయి చికిత్సలపై అవగాహన అత్యంత అవసరమని వైద్యులు హెచ్చరించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స ప్రారంభిస్తే పూర్తిస్థాయి కోలిక సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ సీనియర్ డీజీఎం వినోద్, ఆంధ్రప్రదేశ్ మార్కెట్ టీం లీడర్ ఎస్.వి. రామకృష్ణ, వి.సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పార్వతి కుండలేశ్వర స్వామివారిని దర్శించుకున్న


# 20 పాయింట్స్ ప్రోగ్రాం చైర్‌పర్సన్ లంకా దినకర్



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 20 పాయింట్స్ ప్రోగ్రాం, చైర్‌పర్సన్ లంకా దినకర్ ఈరోజు, శ్రీ పార్వతి కుండలేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే క్షేత్రపాలకులు వేణుగోపాలస్వామి ఆలయం లో దర్శనం చేసుకున్నారు ఈ సందర్భంగా ఆలయ అధికారులు మంగళ వాయిద్యాలతో, పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రములతో సత్కరించి, వారికి దేవస్థానం ఈవో దుర్గ భవాని శ్రీ స్వామివారి చిత్రప టాన్ని బహుకరించారు. బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ సీనియర్ నాయకులు మోకా వెంకటసుబ్బారావు గంగిశెట్టి అరవిందు, బిజెపి జిల్లా ట్రెజరర్ గ్రంధి నానాజీ సీనియర్ నాయకులు మోకా వెంకటసుబ్బారావు , బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి గనిశెట్టి అరవింద్, గోకర కొండ సత్తిబాబు, మోటిపల్లి శీను, గంగు మల్ల భద్రరావు, గంగుమళ్ల బాజీ, బీర్ అంబేద్కర్, చిక్కల అంజి, అరిగల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘించి పంట పొలాల్లో గడ్డి కాలుస్తున్న రైతులు

**ఆర్డీఓ ఆదేశాలు బేఖాతర్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం డివిజన్ పరిధిలో పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిన గడ్డిని తగులబెట్టవద్దని నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని రెవిన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) ఏ.సరళావతి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పలుచోట్ల రైతులు వాటిని బేఖాతర్ చేస్తున్నారు. గడ్డిని కాల్చడం వల్ల పర్యావరణం కలుషితం కావడంతో పాటు భూమిలోని మిత్రపురుగులు చనిపోయి భూసారం దెబ్బతింటుందని పక్కనే ఉన్న ఇతర పంటలకు ప్రమాదం పొంచి ఉంటుందని అధికారులు ముందస్తుగా హెచ్చరించారు. అయినప్పటికీ అధికారుల హెచ్చరికలను ఏమాత్రం లెక్కచేయకుండా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అనేక చోట్ల రైతులు యథేచ్ఛగా పొలాల్లో గడ్డిని కాలుస్తూనే ఉన్నారు. దీనివల్ల పెద్ద ఎత్తున పొగ కమ్ముకుని వాహన చోదకులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆర్డీఓ ఆదేశాలను పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.


# టెంట్ హౌస్ యజమానులు ఐక్యంగా సహకరించుకోవాలి

**బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి**




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుతం టెంట్ హౌస్ రంగంలోకి కార్పొరేట్ తరహా విధానంలోకి వెళ్ళిపోతుందని దాన్ని తిరిగి తమ ఆధీనంలోనే ఉంచుకునే విధంగా సౌకర్యాలు అందించి తగు మన్ననలను పొందాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం కాకినాడ సినిమా రోడ్లో ఉన్న ఓ హోటల్లో కాకినాడ జిల్లా టెంట్ హౌస్ ఫంక్షన్ మెటీరియల్ లైటింగ్ అండ్ సౌండ్ సిస్టం యజమానుల సంక్షేమ సంఘం (రి.146/2026) కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ టెంట్ హౌస్, మెటీరియల్ అన్ని వేడుకలకు చాలా ముఖ్య అవసరమన్నారు. గతంలో వివిధ విభాగాలుగా ఉన్న వారందరూ కలిసి ఒకే వేదికపై వచ్చి సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకోవడం అత్యంత ఆనందకరమని అన్నారు. భవిష్యత్తులో ఒకే కుటుంబంగా వ్యాపార అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని చప్పిడి సూచించారు. సంఘం అధ్యక్షుడు నారాయణ దాస్ బూబ్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఈ తరహా సంఘం ఏర్పాటు చేయాలని అది నేటికి ఒకే సంఘం మీదకు రావడం ఆనందకరమన్నారు. కలసికట్టుగా ఐక్యంగా ఈ యజమానుల సంఘం పనిచేసి గౌరవం పొందుతామని చెప్పారు. సంఘం గౌరవ అధ్యక్షుడు యక్కల ప్రసాదరావు, దొంతికుర్తి కాశీ విశ్వనాథ్, కార్యదర్శి కొప్పిశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు నడికట్ల లోవరాజు, జాయింట్ సెక్రటరీ డొకుబుర్ర రామరాజు, జాయింట్ ట్రెజరర్ రెడ్డి సత్తిబాబు, యడ్ల వేణునాదం, సోమేశ్వరరావు, బన్నూ, వాసు, చిన్న, నాగేశ్వరరావు, శ్రీనివాస్, వీరబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడలో రీల్ సీన్ రియల్‌గా.. ఖరీదైన కార్లతో యువకుల ఢీ



సినిమాల్లో మాత్రమే కనిపించే సీన్లు ఇటీవల కాలంలో తరచూ రియల్ లైఫ్ లోనూ దర్శనమిస్తున్నాయి. డబ్బు.. రాజకీయ పలుకుబడి ఉంటే చాలు.. తామేం చేసినా నడిచిపోతుందన్న తీరు అంతకంతకూ పెరుగుతోంది. దీంతో.. ఇంతకాలం రీల్ లైఫ్ లో మాత్రమే దర్శనమిచ్చే ఉదంతాలు ఇప్పుడు రియల్ లైఫ్ లోనూ కనిపిస్తున్న పరిస్థితి. అలాంటి ఉదంతమే ఒకటి విజయవాడ నడిరోడ్డు మీద చోటు చేసుకుంది. ఒక యువతి విషయంలో చోటు చేసుకున్న వివాదం.. చివరకు ఇద్దరు యువకులు తమ ఖరీదైనకార్లతో ఢీ కొట్టుకోవటం (గుద్దుకోవటం).. ఈ క్రమంలో స్థానికులు భయభ్రాంతులై పరుగులు తీసిన పరిస్థితి. విజయవాడలో పెను సంచనలంగా మారిన ఈ ఉదంతంలో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతా అయ్యాక స్టేషన్ కు సీన్ షిఫ్ట్ అయ్యేలా ఇప్పుడీ ఇష్యూ విజయవాడలోని పడమట పోలీసు స్టేషన్ లో ఉంది. ఇంతటి ఘర్షణకు కారణాలేంటి? ఇంతకూ నడిరోడ్డు మీద ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఆ ఇద్దరు యువకులు ఎవరు? వారి నేపథ్యం ఏంటి? లాంటి అంశాల్లోకి వెళితే.. అసలు ఇలాంటి ఉదంతాలు చోటు చేసుకుంటాయో అర్థమవుతుంది. షాకింగ్ నిజం ఏమంటే.. నడిరోడ్డు మీద ఇంతటి రచ్చ చేసిన ఇద్దరు యువకులు చిన్ననాటి స్నేహితులు కావటం. ఒక యువతి విషయం ఇద్దరు స్నేహితులను శత్రువులుగా మార్చటమే కాదు.. ఒకరి సంగతి మరొకరు చూసుకోవాలన్న పంతం వరకు వెళ్లింది. ఈ ఇష్యూకు కారణమైన ఇద్దరు యువకుల్లో ఒకరు కృష్ణా జిల్లా పెనమలూరు మండలం తాడిగడపకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి లింగమనేని రోహిత్. మరొకరు విజయవాడ భారతీనగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బొల్లా ఓమ్. ఇద్దరు చిన్ననాటి స్నేహితులు. ఒక యువతి విషయంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఒకరు గురించి మరొకరు తప్పుగా మాట్లాడుకుంటున్నారన్న అనుమానం తాజా వివాదానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఈ క్రమంలో వీరిద్దరు ఫోన్ లో మాట్లాడుకోవటం.. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య మాటామాటా పెరిగి.. ఒకరికొకరు సవాళ్లు విసురుకున్నారు. వీరిద్దరి మధ్య హాట్ హాట్ గా ఫోన్ సంభాషణ సాగిన సమయంలో తాను పటమట ఆర్ ఆర్ గార్డెన్ లోని హైటెన్షన్ రోడ్డులో ఉన్నానని రోహిత్ చెప్పటం.. తాను అక్కడికి వస్తున్నట్లుగా ఓమ్ చెప్పారు. ఆవేశంతో థార్ జీపుతో బొల్లా ఓమ్ అక్కడికి చేరుకోవటమే కాదు వచ్చీ రాగానే తన జీపును నేరుగా రోహిత్ కారును ఢీ కొన్నారు. అందుకు ప్రతిగా రోహిత్ సైతం తన కారుతో ఓమ్ థార్ వాహనాన్ని ఢీ కొనటంతో ఈ ఇష్యూ మరింతగా పెరిగి... స్ట్రీట్ ఫైట్ గా మారింది. వీరి దెబ్బకు స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఓమ్ తో మరికొందరు రావటం.. వారంతా రాడ్లు తీసుకొని రోహిత్ కారుపై దాడికి దిగారు. ఈ సందర్భంగా రోహిత్ కారుకు పంక్చర్ కావటంతో అక్కడి నుంచి అతను పారిపోయాడు. ఇదంతా రాత్రి వేళలో చోటు చేసుకుంది. పోలీసుల నిఘా తక్కువగా ఉండే ఈ ప్రాంతాన్ని తమ అధిపత్యాన్ని ప్రదర్శించుకోవటానికి ఎంచుకున్నట్లుగా పోలీసులు భావిస్తున్నారు. హైటెన్షన్ రోడ్డె మీద తమ ఖరీదైన కార్లను రేసింగ్ తరహాలో దూసుకెళ్లేలా చేసి.. ఒకరికొకరు ఎదురెదురుగా ఢీ కొట్టుకునే ప్రయత్నం చేయటం గమనార్హం. దీంతో పెద్ద ఎత్తున శబ్దాలు..కార్లనుంచి పొగలు వచ్చాయి. అర్ధరాత్రి వేళ జరిగిన ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో రోడ్ల మీద ఉన్న వారైతే.. ప్రాణభయంతో పరుగులు తీశారు. వీరి రచ్చకు సంబంధించిన అంశాలు సీసీ కెమేరాలో స్పష్టంగా నమోదయ్యాయి. ఈ ఉదంతం గురించి సమాచారం అందుకున్నంతనే సీఐ పవన్ కిషోర్ అక్కడకు చేరుకొని..పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. గ్యాంగ్ వార్ తరహాలో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచనలంగా మారింది. ఒకరి కారుతో మరో కారును ఢీ కొనే వేళలో కార్ల వేగం ఎంతన్న విషయాన్ని గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం ఫోరెన్సిక్ నిపుణుల సాయాన్ని తీసుకుంటున్నారు. ఓమ్, రోహిత్ బ్యాక్ గ్రౌండ్ విషయానికి వస్తే.. ఇందులో బొల్లా ఓమ్ వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ కు అత్యంత సన్నిహిత బంధువుగా చెబుతున్నారు. గతంలో వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన వేడుకలను భారీగా నిర్వహించటం.. పెద్ద ఎత్తున కార్లు.. జీపులతో భారీ ర్యాలీలో ఓమ్ కీలకంగా వ్యవహరించారని చెబుతారు. ఇక.. లింగమనేని రోహిత్ విషయానికి వస్తే.. ఒక సంపన్న కుటుంబానికి చెందిన యువకుడిగా చెబుతున్నారు. విజయవాడలోని ఒక ఫేమస్ కాలేజీలో బీటెక్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధాలు లేనప్పటికి.. బలమైన ఆర్థిక.. సామాజిక నేపథ్యం ఉన్న కుటుంబంగా చెబుతున్నారు. రెండు సంపన్న కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు బాధ్యత మరిచి.. రోడ్ల మీద ఇష్టారాజ్యంగా వ్యవహరించిన తీరుపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని.. లేదంటే రాబోయే రోజుల్లో ఈ తరహా ఉదంతాలు మరింత పెరగటం ఖాయమని హెచ్చరిస్తున్నారు. మరేం జరుగుతుందో చూడాలి.

కోనసీమ కేర్ హాస్పిటల్‌లో

# ఉచిత గుండె పరీక్షలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** హీరో మహేష్ బాబు సహకారంతో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ లింగస్వామి కోనసీమ కేర్ హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కోనసీమ కేర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారేం రవితేజ ఆయనకు స్వాగతం పలికారు. డాక్టర్ కారేం రవితేజ ఆధ్వర్యంలో కోనసీమ కేర్ హాస్పిటల్‌లో ఉచిత హార్ట్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహేష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ హీరో మహేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మహేష్ బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు కొప్పిశెట్టి నరసింహమూర్తి, దొమ్మేటి స్వామిని డాక్టర్ రవితేజ అభినందించారు. ప్రతి నెల నాలుగో శుక్రవారం డాక్టర్ లింగస్వామి కోనసీమ కేర్ హాస్పిటల్‌కు వస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. కోనసీమ కేర్ హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకున్న చిన్నారుల్లో ఎవరికైనా గుండె సంబంధిత వ్యాధులు ఉన్నట్లయితే, హీరో మహేష్ బాబు సహకారంతో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని వెల్లడించారు. పేద ప్రజలకు అండగా నిలుస్తూ పలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న డాక్టర్ కారేం రవితేజను పలువురు అభినందించారు.

రామచంద్రపురంలో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' ద్వారా

# పట్టణ పారిశుద్ధ్యం మెరుగు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని పురపాలక సంఘాల్లో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో మే 22 నుంచి జూన్ 20 వరకు నాలుగు వారాలపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురం పట్టణంలో విస్తృత పారిశుధ్య పనులు చేపట్టారు. రామచంద్రపురం మార్కెట్ సెంటర్ నుంచి ముచ్చుమిల్లి రోడ్డు లలిత నగర్ వరకు అధికారులు, కూటమి పార్టీల నాయకులు స్వయంగా చీపుర్లు పట్టి రోడ్లు, డ్రైనేజీలు, పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ అధికారి, మున్సిపల్ ప్రత్యేక అధికారి సరళావతి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు పరిశుభ్రత అత్యంత అవసరమని అన్నారు. పట్టణాలను శుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన రామచంద్రపురం సాధ్యమని తెలిపారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిరంతరాయ ప్రక్రియగా కొనసాగిస్తూ అన్ని వర్గాల ప్రజలు, యువత, విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణాన్ని సుందరీకరించేందుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేస్తున్నారని పట్టణాభివృద్ధిలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కూడా పాలు పంచుకుని సహకరిస్తుందని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ రాజు మాట్లాడుతూ పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం అనే దిశగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని పరిసరాల పరిశుభ్రతతోనే ఇది సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ డేవిడ్ రాజు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, జనసేన పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, గరికపాటి సూర్యనారాయణ, ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ నారపురెడ్డి బలరాం, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, ఏసుదాసు, రెడ్డి సురేష్, పోలిశెట్టి పెదబాబు, నంబుల నాగు, కూటమి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శోభా ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాల నివారణపై

# ఫైర్ అధికారుల మాక్ డ్రిల్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని ప్రముఖ శోభా ఆసుపత్రి (డాక్టర్ వెంకటరత్నం ఆసుపత్రి)లో శుక్రవారం ఫైర్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రి ప్రాంగణంలో అనుకోకుండా అగ్ని ప్రమాదం సంభవిస్తే, తక్షణమే స్పందించి ఆ ప్రమాదాన్ని ఏ విధంగా నివారించాలి అలాగే ప్రమాదంలో చిక్కుకున్న రోగులను, బాధితులను సురక్షితంగా ఏ విధంగా రక్షించుకోవాలనే అత్యవసర అంశాలపై ఫైర్ ఆఫీసర్ కె.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందికి ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. భవిష్యత్తులో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది నిత్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా ప్రమాణాల గురించి అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం ఫైర్ అధికారి కే.వెంకటరెడ్డి, లీడింగ్ ఫైర్‌మాన్ సుబ్రమణ్యం, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పి.వెంకటరత్నంలతో పాటు ఫైర్ సిబ్బంది, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అమలాపురం పట్టణంలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్"

**కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు**

**పట్టణ సుందరీకరణ, పారిశుధ్య మెరుగుదలకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రతిష్టాత్మక "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం ఉదయం ప్రారంభించారు. పట్టణంలోని ముఖ్య కూడళ్లలో పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పట్టణ పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పనులను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కేవలం ఒకరోజు కార్యక్రమం కాదని, నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి వీధి, ప్రతి వార్డు పరిశుభ్రంగా మారేంతవరకు ఈ ప్రత్యేక డ్రైవ్ నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకే అందించేలా వార్డు సిబ్బంది బాధ్యత తీసుకోవాలని సూచించారు. అమలాపురాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు కేవలం అధికారులకు ఆదేశాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, స్వయంగా చేతిలో చీపురు పట్టుకుని రోడ్లను ఊడుస్తూ శ్రమదానం చేశారు. ఒక సామాన్య కార్యకర్తలా పారిశుధ్య పనుల్లో పాల్గొనడం చూసి స్థానిక ప్రజలు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు కూడా స్వచ్ఛత కోసం శ్రమించేందుకు ముందుండాలని ఈ సందర్భంగా ఆయన సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, స్థానిక కూటమి నాయకులు, వార్డు కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమమే మా ప్రాధాన్యత

**జిల్లా ఎస్పీ రాహుల్ మీనా**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయంలో, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ప్రత్యేకంగా "ఎస్పీ సంపర్క్" కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలను మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ ద్వారా ఎస్పీకి వివరించారు. సిబ్బంది తమ బదిలీలు, సెలవులు, ఆరోగ్య సమస్యలు, ఇతర సేవా సంబంధిత ఇబ్బందులను ఫోన్ ద్వారా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా విన్న ఎస్పీ, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేలా సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఈ సందర్భంగా ఎస్పీ భరోసా ఇచ్చారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, భద్రత మా మొదటి ప్రాధాన్యత. సిబ్బంది మానసిక ప్రశాంతతతో ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరు. అందుకే వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాము" అని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సుతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

**పిల్లల్లో నూతన ఆలోచనా శక్తికి ఏఐ తోడ్పాటు**

**మైవిజ్ ఏఐ స్మార్ట్ సమ్మర్ క్యాంపును ప్రారంభించిన "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" అధినేత**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచానికి చిన్నారులను సిద్ధం చేసే లక్ష్యంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైవిజ్ ఏఐ స్మార్ట్ సమ్మర్ క్యాంపు- 2026 కార్యక్రమాన్ని ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. రామచంద్రపురం టౌన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు భారీగా హాజరై విశేష స్పందన తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ వైవా ఐటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూపొందించిన "మైవిజ్ ఏఐ" ప్లాట్‌ఫామ్ ద్వారా పిల్లల్లో క్రిటికల్ థింకింగ్ , క్రియేటివిటీ , కమ్యూనికేషన్ స్కిల్స్ , ప్రాబ్లెమ్ సాల్వింగ్ వంటి నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో విద్యార్థులు స్మార్ట్ ఫోన్లు, గాడ్జెట్లకు అలవాటు పడుతూ.. సరైన మార్గదర్శకత్వం లేకపోతే టెక్నాలజీ ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. సరైన దిశలో టెక్నాలజీని వినియోగిస్తే పిల్లలు భవిష్యత్ ఆవిష్కరణలకు నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతారన్నారు. కృతిమ మేధస్సు భవిష్యత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయబోతుందని, ఏఐను బాధ్యతాయుతంగా, సురక్షితంగా వినియోగించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత ఏఐ శిక్షణ కార్యక్రమంలో 6 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ పై పిల్లలకు Child-Safe AI లెర్నింగ్ అందించేందుకు హైదరాబాద్ నుంచి నిపుణులను ప్రత్యేకంగా రప్పించినట్లు తెలిపారు. పిల్లల్లో ఆలోచించే విధానాన్ని పెంపొందించేందుకు, ఏఐని తెలివిగా, బాధ్యతతో, సురక్షితంగా వినియోగించే భవిష్యత్ నాయకులుగా పిల్లలను తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని పేర్కొన్నారు. మే 22 నుంచి మే 29 వరకు నిర్వహించనున్న ఈ సమ్మర్ క్యాంప్‌లో వాయిస్ ఏఐ లెర్నింగ్ , హోంవర్క్ మోడ్ , మాత్ మోడ్ , రీడింగ్ మోడ్ , డైలీ ఛాలెంజస్ , క్యూరియసిటీ మోడ్ వంటి ఆధునిక ఫీచర్లతో ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలకు ఉపయోగపడే విధంగా ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పిల్లలు కొత్త విషయాలు నేర్చుకుంటున్నారని, ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. టీడీపీ రామచంద్రపురం పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ మాట్లాడుతూ సత్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం నియోజకవర్గ ప్రజలకు సువర్ణావకాశమని అన్నారు. అనంతరం ఐటీ సంస్థ ప్రతినిధులు వాసంశెట్టి సత్యంను దుస్సాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐటీ సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వాలో సిండికేట్ వ్యవస్థను

# రూపుమాపాలంటూ ఆక్వారైతుల నిరసన

**అమలాపురం ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించిన ఆక్వా రైతులు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆక్వా రైతులు వరుస నష్టాలతో తీవ్ర సతమతమవుతున్నా ఎక్స్ పోర్టర్లు, మేతల కంపెనీల యజమానులు ఒక సిండికేట్‌గా మారి ఆక్వా రంగాన్ని అధపాతాళానికి తొక్కేస్తున్నారని ఆక్వా రైతులు తీవ్ర ఆరోపణలు చేశారు.. అమలాపురంలో రాష్ట్ర క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్, ఆక్వా రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు ఆధ్వర్యంలో రైతులు రొయ్యల ధరలు తగ్గింపుపై తీవ్ర నిరసన తెలిపారు. మొన్నటి వరకు రొయ్యల మేతల ధరలు భారీగా పెంచి ఆక్వా రైతాంగాన్ని తీవ్రంగా ఇబ్బందులు పాలు చేశారని, దీనిపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవ్వడంతో మేతల ధరలు తగ్గించి ఇప్పుడు మళ్లీ రొయ్యల ధరలు తగ్గించేశారని మండిపడ్డారు. దేశానికి అత్యధిక ఆదాయాన్ని తీసుకువచ్చే డాలర్ల పంట ను ఓ పక్క ఎక్స్ పోర్టర్లు, మరో పక్క మేతల కంపెనీలు నిలువునా మోసం, దగా చేస్తున్నాయని, ఈ రెండు వ్యవస్థలు సిండికేట్‌గా మారి ఆక్వా రంగాన్నినమ్ముకున్న రైతులను నిలువునా దగా చేస్తున్నారని మండిపడ్డారు. సత్తిబాబు రాజు మాట్లాడుతూ ఆక్వా రంగంలో దళారీ వ్యవస్థ, సిండికేట్ వ్యవస్థను రూపుమాపాలని అన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సిండికేట్ వ్యవస్థపై నియంత్రణ చర్యలు చేపట్టి రొయ్యల ధరలు పెంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో ఆక్వా రైతు నాయకుడు త్సవటపల్లి నాగభూషణం మాట్లాడుతూ ఆక్వా రంగం వెంటిలేటర్ పై ఉందని, ఓ పక్క మేతల ధరలు పెంచి ఆపై రైతులు ఉద్యమ బాట పడితే ధరలు తగ్గించినట్లే తగ్గించి ఇప్పుడు రొయ్యల ధరలు తగ్గించేశారని, అంతర్జాతీయ మార్కెట్లో ఎటువంటి వ్యత్యాసాలు లేకపోయినా ధరలు తగ్గించడం దారుణమన్నారు. అనంతరం అమలాపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ర్యాలీగా వచ్చి వినతి పత్రాన్ని ఎమ్మెల్యే ఆనందరావుకు సమర్పించారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఆక్వా రంగాన్ని వైసీపీ ప్రభుత్వం నష్టాల ఊబిలోకి నెట్టిందని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆక్వా పరిశ్రమకు జవసత్వాలు ఇచ్చిందన్నారు. ప్రస్తుతం మేతల ధరల పెంపు పై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని ధరలు తగ్గించేలా చర్యలు తీసుకున్నారని, ఇప్పుడు రొయ్యల ధరలు తగ్గించడంపై కూడా కూటమి ప్రభుత్వం ఎక్స్ పోర్టర్స్‌తో చర్చించి చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేసి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లూరి రమేష్ రాజు, దెందుకూరి దుర్గరాజు, వేగిరాజు వెంకటరాజు, సత్తి శ్రీను, వాసు రాజు, మోటూరి కిరణ్, అధికారి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో

# ప్రజా సమస్యల అర్జీల స్వీకరణ

**ప్రజా సమస్యలపై త్వరితగతిన స్పందించాలి**

**అధికారులకు ఎమ్మెల్యే ఆనందరావు ఆదేశం**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో "ప్రజాదర్బార్" ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు స్వయంగా వినిపించారు. ఈ సందర్భంగా మొత్తం 95 అర్జీలు నమోదయ్యాయి. పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు తదితర వ్యక్తిగత, గ్రామ సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. వచ్చిన 95 అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించి, ప్రజా సమస్యలపై త్వరితగతిన స్పందించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. క్యాంపు కార్యాలయానికి వచ్చే ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై

# రాజకీయ పార్టీలతో సమావేశం

**ఓటరు నమోదుకు సహకరించాలి ఆర్డీవో ఎ.సరళవతి**




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎ.సరళవతి ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, రామచంద్రపురం వారు కోరారు. శుక్రవారం రెవెన్యూ డివిజన్ అధికారి వారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల దరఖాస్తులైన ఫారం 6, 7, 8 ల స్థితి, ఓటర్ల మ్యాపింగ్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ (డీఎస్ఈ), పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్, బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై చర్చించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించిన షెడ్యూల్, బూత్ లెవల్ అధికారుల ఇంటింటి సందర్శనలు, annexure III, IV ఫారాల పంపిణీ, కొత్తగా ఓటరుగా నమోదు కావడానికి అవసరమైన పత్రాలు వంటి అంశాలను విపులంగా వివరించారు. ఇంత వరకు ఓటర్ల మ్యాపింగ్ నియోజకవర్గం నందు 64.32% అయ్యినదని, 1200 ఓట్లు దాటిన పోలింగ్ స్టేషన్ లను గుర్తించి పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ లో బాగంగా కొత్త పోలింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేయటం జరుగుతుందని, అన్ని రాజకీయ పార్టీలు వెంటనే బూత్ లెవెల్ ఏజెంట్లను (బి ఎల్ ఏ) నియమించి, 100% ఓటరు నమోదుకు బి ఎల్ ఓ లకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన సందేహాలకు ఆర్డీఓ సమాధానాలు ఇచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ టౌన్ మాజీ అధ్యక్షులు ఉండవల్లి శివ, టిడిపి నాయకులు చప్పిడి సతీష్, వైఎస్ఆర్సీపీ నాయకులు కొయ్య బంగారు బాబు,పోతంరాజు బాబూరావు,పొలినాటి వర ప్రసాద్, జనసేన టౌన్ సెక్రటరీ ఎస్.శ్రీహరి పంతులు, టౌన్ ప్రెసిడెంట్ జి.కృష్ణ, బి.ఎస్.పి. పార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కాళీ పాల్గొన్నారు. అధికారుల తరపున తహశీల్దార్, రామచంద్రపురం, కాజులూరు మరియు కె.గంగవరం వారు, మున్సిపల్ కమిషనర్, రామచంద్రపురం, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్, సీనియర్ అసిస్టెంట్లు, ఎన్నికల ఆపరేటర్లు హాజరయ్యారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షురాలిగా

# అంబటి భవాని నియామకం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం ఉపాధ్యక్షురాలిగా అంబటి భవాని నియమితులయ్యారు. పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఒక సామాన్య కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తున్న తనకు రాష్ట్ర స్థాయి కమిటీలో ఇంతటి కీలకమైన బాధ్యతలు అప్పగించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. తన నియామకానికి సహకరించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పిల్లి సూర్యప్రకాష్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రెసిడెంట్ కాకుమాను రాజశేఖర్‌లకు అంబటి భవాని తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అంబటి భవాని మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రచార విభాగం తరపున నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు. అలాగే తాను రాజకీయంగా ఎదగడానికి, అన్ని వేళలా ఆదరిస్తూ తన వంతు సహకారాన్ని అందిస్తున్న పాత్రికేయ సోదరులందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో అందరినీ కలుపుకుని పార్టీ బలోపేతం కోసం మరింత ముందుకు సాగుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు.



# పారి షుగర్ కంపెనీ మూసివేత రోడ్డున పడ్డ కార్మికులు

**సుమారు 20 మందికి 40 లక్షల రూపాయలు బకాయిలు**
**మాకు న్యాయం చేయాలని నిరసన తెలిపిన ఉద్యోగులు**

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం**



కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో ఉన్న పారీ షుగర్ కంపెనీలో పనిచేసిన సుమారు 20మంది ఉద్యోగులుకు కంపెనీ సుమారు 40 లక్షల రూపాయలను జీతభత్యాలుగా ఉద్యోగు లుకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ మూసేసినప్పుడు ఇందులో పనిచేసిన అందరికీ రావలసిన బకాయిలు ఇచ్చారని కానీ ఈ 20 మందికి బకాయిలు చెల్లించకపోవడం బాధాకరం. తక్షణం మాకు న్యాయం చేయాలంటూ ఉద్యోగస్తులు కంపెనీ గేటు ముందు ధర్నా నిర్వహించారు. సుమారు ఐదు సంవత్సరాలుగా పనిచేస్తున్న మాకు తక్షణం మాకందరికీ రావలసిన 40 లక్షల రూపాయలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మాకు జరుగుతున్న అన్యాయం కోసం స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీకి చెప్పడం కూడా జరిగింది. ఆయన నేను న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్యంగా జిల్లా కలెక్టర్‌కి, లేబర్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు కార్మికులు తెలిపారు. కంపెనీ మూసేటప్పుడు యాజమాన్యం అందరికీ న్యాయం చేయాలని కానీ 20 మంది ఉద్యోగులకు నేటికి బకాయిలు చెల్లించకపోవడం కార్మిక చట్టం ప్రకారం విరుద్ధం అని వాళ్లు తెలిపారు. మాకు ఉద్యోగం లేక మా చేతులలో డబ్బులు లేక మమ్మల్ని నమ్ముకున్న మా కుటుంబాలకు తిండి పెట్టే స్థితిలో కూడా మేము లేమని, మా కుటుంబాలలో ఆరోగ్యరీత్యా ఎవ్వరికి ఏమి జరిగిన అకస్మాత్తుగా ఏమి చేయలేని స్థితిలో ఉన్నామని వాళ్ల బాధను తెలియజేశారు. అలాగే ఈ 20 మందిలో ఒక కార్మికుడికి కంపెనీ పని చేస్తున్న టైంలో యాక్సిడెంట్ అయిందని ఆ పర్సన్ కి కూడా కంపెనీ రూల్స్ ప్రకారం, కార్మిక చట్టం ప్రకారం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని , ప్రభుత్వం మాకు న్యాయం చేయాలని మాకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపారు.

# జిల్లా ఎస్పీ ఆదేశాలతో పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న పోలీసులు

**యువతకు దిశా నిర్దేశం చేస్తూ హెచ్చరికలు జారీ**



కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : కాకినాడ జిల్లా ఇంచార్జ్ ఎస్పీ రాహుల్ మీనా, ఆదేశాల మేరకు,కాకినాడ ఏఎస్పీ శ్రీ పాటిల్ దేవ్ రాజ్ మనీష్ సూచనలు మేరకు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన “పల్లె నిద్ర” కార్యక్రమంలో కరప ఎస్ఐ టి. సునీత కరప గ్రామంలోనూ, కాకినాడ టూ-టౌన్ ఎస్ఐ దుర్గాప్రసాద్ కాకినాడ, కొత్త కాకినాడ లోనూ మరియు సిబ్బంది పాల్గొని స్థానిక సమస్యలను, పోలీస్ పెట్రోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మహిళల రక్షణ కొరకు ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో “శక్తి యాప్” ఇన్స్టాల్ చేసుకోవాలని, అత్యవసర సమయాల్లో SOS బటన్ నొక్కడం ద్వారా లేదా లొకేషన్ షేర్ చేయడం ద్వారా పోలీసులు ప్రయాణాలను మానిటర్ చేస్తూ రక్షణ కల్పిస్తారని, అలాగే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌ను కూడా సంప్రదించవచ్చని కోరారు. వేసవి సెలవుల దృష్ట్యా, ఇంట్లో ఎవరూ లేకుండా పొరుగూరు వెళ్లేటప్పుడు పోలీసు సహాయం పొందవచ్చని, గూగుల్ ప్లే స్టోర్ లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్ ఎచ్ ఎమ్ ఎస్) యాప్ డౌన్లోడ్ చేసుకుని, అందులో మీ ప్రయాణం వివరాలు, మీ లొకేషన్ మొదలైన వివరాలు ఎంటర్ చేస్తే, స్థానిక పోలీసులు వచ్చి, మీరు ఇంటి నుండి బయలుదేరక ముందే పోలీస్ కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేయబడిన కెమెరాలు మీ ఇంటిలో బిగించి వెళ్తారని, ఈ సేవలు పూర్తిగా ఉచితం అని తెలియజేశారు. మహిళా భద్రతకు భంగం కలిగేలా ప్రవర్తిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని.. అలాగే యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు, బైక్ స్టంట్లు, క్రికెట్ బెట్టింగ్‌లు, లోన్ యాప్‌లు మరియు సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తూ, గంజాయి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా టోల్ ఫ్రీ నంబర్ 1972 కు కాల్ చేయాలని సూచించారు. ఇదే సమయంలో, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ వారం రోజుల పాటు “హై అలర్ట్” ప్రకటించినందున, ఎండ తీవ్రత దృష్ట్యా అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని, ముఖ్యంగా వృద్ధులు, బాలింతలు, చిన్నారుల పట్ల జాగ్రత్త వహించాలని, కూలి పనులకు వెళ్లేవారు మజ్జిగ, మంచి నీరు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు వెంట ఉంచుకుని అప్పుడప్పుడు తాగుతూ, ఎండ వేడి ఎక్కువగా ఉన్నప్పుడు చెట్ల నీడన సేదతీరాలని ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# వడదెబ్బకు కార్మికుడు మృతి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం సర్పవరం పంచాయతీ లో పనిచేస్తున్న కార్మికుడు గుర్రం అప్పన్న 38 సంవత్సరాలు శుక్రవారం మధ్యాహ్నం 2.30 నిమిషాలకు పంచాయతీ ఆధీనంలో పనిచేస్తుండగా వాతావరణంలో అధికంగా ఉన్న ఎండ తీవ్రత వల్ల, అధిక వేడిగాలి వల్ల వడదెబ్బ తగిలి అక్కడకక్కడే మృతి చెందారు. ఈ విషయంలో తోటి కార్మిక సోదరులు మరియు పంచాయతీ సిబ్బంది ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని తెలిపారు.

# యోగాతో మానసిక ఒత్తిడి దూరం - ప్రత్తిపాడు సిఐ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నిత్యం పని ఒత్తిడితో సతమతం అయ్యే వారంతా యోగాతో మానసిక ఒత్తిడిని జయించి, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించ వచ్చని ప్రత్తిపాడు సి.ఐ. సూర్య అప్పారావు పేర్కొన్నారు. హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ప్రోగ్రాంలో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు అన్నవరం రాఘవేంద్ర ఫంక్షన్ హాలులో శుక్రవారం ఉదయం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రత్తిపాడు సిఐ.సూర్య అప్పారావు మాట్లాడారు. నిత్యం పోలీసులు తమ విధి నిర్వహణలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతారని, అటువంటి వారికి యోగా ధివ్య ఔషదంలా పని చేస్తుందని తెలిపారు. పోలీసు సిబ్బందికి ఒత్తిడిని తగ్గించి, వారికి ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. అనంతరం యోగా గురువు బ్యాటరీ సత్తిబాబు స్వీయ పర్యవేక్షణలో యోగా సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో తుని రూరల్ సీఐ చెన్నకేశవ రావు, ప్రత్తిపాడు ఎస్ఐ. లక్ష్మీకాంతం, అన్నవరం ఎస్ఐ. శ్రీహరిబాబు, పోలీస్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వనదుర్గమ్మ ఆలయంలో ‘ఖడ్గమాల’ పూజలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం రత్నగిరిపై వన దేవతగా పూజలను అందుకుంటున్న వనదుర్గమ్మ అమ్మ ఆలయంలో ఖడ్గమాల పూజలు, చండీ హోమాలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నూతన ఆర్జిత సేవగా ప్రారంభమైన ఖడ్గమాల పూజలు ఉదయం 7.30 నుండి 8.30 గంటలకు వరకూ నిర్వహించారు. రూ.1,116 టిక్కెట్ రుసుముతో పలువురు భక్తులు ఖడ్గమాల పూజల్లో పాల్గొన్నారు. పూజలు అనంతరం అందరికీ అమ్మవారి రాగి రూపు, కంకణం, అమ్మవారి కుంకుమ, శేష వస్త్రం, 250 గ్రాముల పులిహోర ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఉదయం 9 గంటలకు అమ్మ వారికి చండీహోమం ప్రారంభించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అమ్మవారికి మూల, మంత్ర జపములు, సప్తపతి పారాయణం నిర్వహించారు. హోమం వద్ద విశేష పూజలు అనంతరం 11 గంటలకు హోమ గుండంలో పవిత్ర ద్రవ్యాలను సమర్పించి చండీహోమానికి పూర్ణాహుతి గావించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, ఋత్విక బృందం పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో తీవ్రమైన ఉష్ణోగ్రత పరిస్థితులు

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా స్థాయి అత్యవసర సహాయ కేంద్రం (కాల్ సెంటర్) నెంబర్: 98499 03879**
**మే 23 నుండి నెల రోజుల పాటు “ఆపరేషన్ క్లీన్ స్వీప్” (మన కాకినాడ - మన బాధ్యత)**
**జూన్ 5 నుండి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం : జిల్లా కలెక్టర్ ఎం ఎస్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** శుక్రవారం సాయంత్రం కలెక్టరేటు వివేకానంద హాలులో జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.హరేంధిర ప్రసాద్ ప్రెస్ మీట్ నిర్వహించి జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న హీట్ వేవ్ పరిస్థితులలో ఆరోగ్య రక్షణకు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, అత్యవసర ప్రజా సమస్యల పరిష్కారానికి కలెక్టరేటులో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ సేవలు, ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా పట్టన పారిశుద్య డ్రైవ్ ల నిర్వహణ, జిల్లాలో జూన్ 5 నుండి ప్రారంభమౌతున్న ఓటరు జాబితాల స్పెషల్ ఇంటన్సీవ్ రివిజన్ ప్రక్రియకు ప్రజా సహకారం అంశాలపై వివరించారు.

**హీట్ వేవ్ పరిస్థితుల పట్ల జాగ్రత్తలు వహించండి**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా తీవ్రమైన ఎండలు, వడదెబ్బ (హీట్ వేవ్) పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో కాకినాడ జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర ప్రసాద్ కోరారు. ముఖ్యంగా ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ బయట తిరగవద్దని విజ్ఞప్తి చేశారు. గతంలో డీహైడ్రేషన్ కారణంగా కొన్ని మరణాలు కూడా సంభవించిన దృష్ట్యా, రాబోయే నాలుగు ఐదు రోజులు వృద్ధులు, చిన్న పిల్లలు, మరియు గర్భిణీ స్త్రీలు ఈ సమయంలో బయటకు రాకుండా ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఎక్కువ నీళ్లు తాగాలని, నీడ ఉన్న చోటనే ఉండాలని కోరుతూ, ఇందుకోసం నగరంలో చలివేంద్రాలు, బస్ షెల్టర్ల వద్ద షేడ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే వెంటనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో కానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కానీ సంప్రదించాలని, అక్కడ ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మరియు అవసరమైన మందులన్నీ సిద్ధంగా ఉంచామని స్పష్టం చేశారు. అలాగే ఉపాధి హామీ కూలీలు, వెజ్ సీకర్లు పనులు త్వరగా పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లేలా ఆదేశాలు ఇచ్చామని, వ్యవసాయ కార్మికులు కూడా ఉదయం 10:00 గంటల తర్వాత పొలాల్లో ఉండకూడదని కోరారు.

**సమస్యల తక్షణ పరిష్కారానికి 24 గంటల ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్**

జిల్లా స్థాయిలో ప్రజలు ఎదుర్కొనే వివిధ అత్యవసర సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండే ఒక ప్రత్యేక ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర




ప్రసాద్ వెల్లడించారు. జిల్లా ప్రజలు తమ సమస్యల కోసం 98499 03879 నెంబర్‌కు ఏ సమయంలోనైనా కాల్ చేయవచ్చని తెలిపారు. వరి/ధాన్యం కొనుగోలులో దళారుల సమస్యలు ఉన్నా, ఎవరైనా అనధికారికంగా డబ్బులు డిమాండ్ చేసినా, లేదా మంచినీళ్ల సమస్యలు, అగ్ని ప్రమాదాలు, వైద్య అత్యవసరాలు తలెత్తినా ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. వీటితో పాటు వరదలు, తుఫానుల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా, లేదా రౌడీ షీటర్లు ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా ప్రజలు భయపడి లొంగిపోకుండా వెంటనే ఈ కాల్ సెంటర్ నెంబర్‌కు సమాచారం అందిస్తే జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.

**రేపటి నుంచే “మన కాకినాడ - మన బాధ్యత” పేరిట ఆపరేషన్ క్లీన్ స్వీప్**

ముఖ్యమంత్రి మరియు ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రేపటి నుండి (మే 23) రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ‘ఆపరేషన్ క్లీన్ స్వీప్’ పరిశుభ్రత డ్రైవ్‌ను కాకినాడ జిల్లాలో “మన కాకినాడ - మన బాధ్యత” అనే నినాదంతో నెల రోజుల పాటు అన్ని అర్బన్ స్థానిక సంస్థలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర ప్రసాద్ ప్రకటించారు. రేపు ఉదయం 6:00 గంటలకే కాకినాడ నగరంలోని గాంధీ పార్క్ వద్ద ఈ క్లీన్ లైన్ డ్రైవ్ ప్రారంభమవుతుందని, కలెక్టర్ స్థాయి నుండి సానిటరీ వర్కర్ వరకు అందరూ ఇందులో ప్రత్యక్షంగా పాల్గొంటారని తెలిపారు. మొదటి రోజు పనులు జోన్-1 లోని వార్డులు 40, 44, 45, 46 లలో మరియు జోన్-2 లోని వార్డులు 38, 39, 41, 42, 43 లలో మొదలవుతాయని వివరించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో నాలుగు వారాల పాటు సాగే ఈ కార్యక్రమాన్ని వారం వారం ఒక థీమ్ తో నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా మొదటి వారం రోడ్ల శుభ్రత మరియు గార్బేజ్ పాయింట్స్ (ఎల్లో/ఆరెంజ్ స్పాట్స్) తొలగింపు, రెండో వారం డ్రైన్లు మరియు నాలాల క్లీనింగ్, మూడో వారం హోటళ్లు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్ల వంటి బల్క్ వేస్ట్ జనరేటర్ల నుండి తడి-పొడి చెత్త సేకరణ మరియు ప్రాసెసింగ్, నాలుగో వారం పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రతను చేపడతామని స్పష్టం చేశారు. పట్టణాలను సుందరంగా, ఆరోగ్య ప్రదంగా తీర్చిదిద్దే లక్ష్యంగా చేపడుతున్న ఈ బృహత్తర పరిశుభ్రతా డ్రైవ్‌లో ప్రజలు, స్వచ్ఛ వాలంటీర్లు, ఎన్జీఓలు అందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**జూన్ 5వ తేదీ నుండి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ**

ఓటరు జాబితాలను స్వచ్ఛతతో, పారదర్శకతను పెంపొందించేందుకు ఎన్నికల కమీషన్ చేపట్టిన జూన్ ‘స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్’ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ) కార్యక్రమం 5వ తేదీ నుండి ప్రారంభం కానుందని కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర ప్రసాద్ తెలియజేశారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా జూన్ 5వ తేదీ నుండి జూన్ 14వ తేదీ వరకు బీఎల్ఓలు, వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు మరియు ఎన్నికల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకూ బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్స్ అందజేసి, నింపిన వాటిని తిరిగి సేకరిస్తారన్నారు. అనంతరం జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాలను ప్రచురిస్తారని, జూలై 21 నుండి ఆగష్టు 20 వరకూ ఈ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరిస్తారన్నారు. జూలై 21 నుండి సెప్టెంబరు 18వ తేదీ వరకూ ప్రజల నుండి అందిన వినతులు, అభ్యంతరాలను ఈఆర్ఓలు పరిశీలించి, 2026 సెప్టెంబరు 22వ తేదీన తుది ఓటరు జాబితాలను ప్రచురించి ప్రకటిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈఆర్ఓ లు తిరిస్కరించిన వాటిపై జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టరుకు అప్పీలు చేసుకోవచ్చున్నారు. అలాగే క్వాలిఫైయింగ్ తేదీ 2026 జూలై 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. అనర్హులను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేకర సవరణ కార్యక్రమం సాగుతుందని, ప్రజలు ఓటరు జాబితాల స్వచ్ఛీకరణ ప్రక్రియకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# నెలకు రూ.కోటి ఖర్చు చేస్తున్నా ఉపయోగం సున్నా

**అపరిశుభ్రతపై శానిటరీ ఇన్స్పెక్టర్ పై సీరియస్ - రత్నగిరి, సత్యగిరి ప్రాంగణాలు పరిశీలన**
**కొత్త కాంక్రీట్ సిమెంట్ రోడ్లను నిర్మించాలి - అన్నవరం దేవస్థానం ఈవో చక్రధరరావు ఆదేశం**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలోని రత్నగిరి, సత్యగిరి ప్రాంగణాలను దేవస్థానం కార్యనిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధరరావు శుక్రవారం పరిశీలించారు. దేవస్థానం ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, శానిటేషన్ అధికారులతో కలసి రత్నగిరి, సత్యగిరులపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. అందలి వసతి సముదాయాలను పరిశీలించి సత్రం గదుల్లో పరిశుభ్రతా వాతావరణాన్ని ఉంచాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. మొదటి, రెండవ ఘాట్ రోడ్లను, డ్రెయిన్లను పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మతులను చేపట్టాలని, కొన్ని చోట్ల కాంక్రీట్ సిమెంట్ రోడ్లను నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం దిగువన గ్రామంలోని కొత్తపేటలోని దేవస్థానం గోశాలను పరిశీలించి, గోవులకు అన్ని సౌకర్యాలూ సక్రమంగా ఉండాలని, గోశాలలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని, దేవస్థానం వ్యాప్తంగా ఉన్న అన్ని రోడ్లు, డ్రైన్లు పరిశీలించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రత్నగిరిపై ఆన్ లైన్ ద్వారా భక్తులు పొందే సేవా టికెట్ల ప్రాంతాన్ని



పరిశీలించి, టిక్కెట్ల కొరకు భక్తులు ఎక్కువ సమయం నిరీక్షించకుండా వారికి టికెట్స్ అందజేయాలని అక్కడ సిబ్బందికి సూచించారు. వీటితోపాటు ప్రధాన ఆలయం ప్రాంగణాలు, క్యూలైన్లు పరిశీలించి భక్తులకు త్వరిత గతిన దర్శనం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా క్యూలైన్లలో భక్తులకు నిరంతరాయంగా చల్లని తాగు నీరు, సర్క్యులర్ మండపం వద్ద చల్లని మజ్జిగ అందించాలని ఆదేశించారు. సత్య గిరిపై ఉన్న హరిహర సదన్ సత్రం గదులను, ప్రాంగణాలను పరిశీలించారు. సత్రం గదుల్లో దుప్పట్లను శుభ్రం చేసే వాషింగ్ మెషీన్లను పరిశీలించి, విద్యుత్ శాఖ అధికారులకు పలు సూచనలు చేసారు.

**శానిటేషన్‌పై సీరియస్**

దేవస్థానంలో పలు పరిసరాలు, సత్యగిరిపై హరిహర సదన్ ప్రాంగణాలు అపరిశుభ్రంగా ఉండటంతో దేవస్థానం శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావుపై ఈఓ చక్రధరరావు ఆగ్రహం వ్యక్తం చేసారు. మీవల్ల కాకపోతే తప్పుకోండని, పరిసరాలు పరిశుభ్రంగా లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. శానిటరీ నిర్వహణకు దేవస్థానం ప్రతీ నెలా సుమారు కోటి రూపాయలు చెల్లిస్తున్నా బాధ్యతగాఎందుకు లేరంటూ “పద్మావతి కాంట్రాక్టు” ఉద్యోగులపై మండి పడ్డారు. పాలనలో పారదృకత ఉండాలన్నారు. కార్య నిర్వహణ అధికారి వెంట ఇంజనీరింగ్ ఈఈ రామకృష్ణ, ఎలక్ట్రికల్ డిఇ విశ్వనాధుల సత్యనారాయణ, శానిటరీతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

# మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కాకినాడను డ్రగ్స్, గంజాయి, రౌడీయిజానికి నిలయంగా మార్చారు

**కాకినాడ నగరం ఎమ్మెల్యే కొండబాబు హయాంలో అభివృద్ధిలో పయనిస్తోంది : టీడీపీ నేతలు వెల్లడి**

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి హయాంలో కాకినాడ సిటీని డ్రగ్స్ గంజాయి మాఫియా గాను, అరాచకాలకు, రౌడీలకు నిలయంగా మార్చారని ప్రస్తుత ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) అభివృద్ధికి, ప్రశాంతతకు మారుపేరుగా తీర్చిదిద్దారని కాకినాడ సిటీకి చెందిన టీడీపీ నేతలు వెల్లడించారు. రెండు రోజుల క్రితం వైసీపీకి చెందిన 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మల్లా కిషోర్ తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే వనమాడి పైన అసందర్భ అనవసర వ్యాఖ్యలు చేశారని దీనిపై తాము స్పందించి ప్రజలకు నిజాలు వెల్లడిస్తున్నట్లు తెలియజేశారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో కాకినాడ నగర టీడీపీ ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, 22వ డివిజన్ ఇంచార్జి పిర్ల లక్ష్మీప్రసన్నలు మాజీ కార్పొరేటర్ కిషోర్, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చేసిన అరాచకాలు పాత్రికేయులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీకి చెందిన 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మల్ల కిషోర్ తాను చదువుకున్న ఎంఎస్ఎన్ విద్యాసంస్థల్లో గ్రౌండ్ చదును చేసేందుకు చెత్తా చెదారాలతో నిండిన మట్టిని వేసి అక్రమాలకి పాల్పడ్డారన్నారు. అలాగే బజారులో తన అనుచరులతో మేక మాంసం అమ్మే దుకాణం వద్ద గోమాంసం అమ్మించారని తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సీజ్ చేయించినట్లు చెప్పారు. అలాగే బడే వారి వీధిలో పాడుబడ్డ భవనంను కిషోర్ అనుచరులు మాదక ద్రవ్యాల నిలయంగా మార్చారని చెప్పారు. ఇప్పుడు 22వ డివిజన్ ఎమ్మెల్యే వనమాడి హయాంలో అభివృద్ధి పథంలో నడుపుతుందన్నారు. తుమ్మల రమేష్ మాట్లాడుతూ ద్వారంపూడి 2009లో తొలిసారి ముగ్గురు పోటీ చేయడం వల్ల ప్రజారాజ్యం అభ్యర్థితో లోపాయికారంగా పొత్తుతో అతి తక్కువ మెజారిటీతో గెలిచారన్నారు. ఆయన గెలవడానికి దివంగత వైఎస్, జగన్ కారణం కాదని మెగాస్టార్ చిరంజీవి దయవల్లనని చెప్పారు. చిరంజీవి



ఫోటోలు పెట్టుకుని ద్వారంపూడి తిరగారన్నారు. 2014లో జనసేన అభ్యర్థిని ఇరకాటంలో పెట్టి తాను గెలిచారని ఆ తర్వాత మాజీ మంత్రి ముత్తా ఇంటికి వెళ్లి ఆశీర్వాదం తీసుకొని ఒక ఫ్లైఓవర్కి పేరును పెట్టారన్నారు. అంత ముందు ఎమ్మెల్యే కొండబాబు కాకినాడ సిటీ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసి ఎటువంటి నేరాలు జరగకుండా అన్నిచోట్ల సీసీ కెమెరాలతో కమాండ్ కంట్రోల్స్ సెంటర్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు ద్వారంపూడి హయాంలో సీసీ కెమెరా పనిచేయకుండా కాకినాడను మాదకద్రవ్యాలకు, రౌడీయిజం, అక్రమాలు, అన్యాయాలకు నిలయంగా మార్చారన్నారు. ద్వారంపూడిని కాకినాడ ప్రజలు తిరస్కరించారని, వనమాడిని ఆదరిస్తున్నారని ఆయన చెప్పారు. ద్వారంపూడి వైఖరి వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారని వనమాడి అత్యధిక మెజారిటీతో ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ద్వారంపూడి ఇక ఎమ్మెల్యే అవ్వలేరని కాకినాడ కొండబాబు హయాంలోనే నిరంతరం అభివృద్ధి జరుగుతుందని వారు చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు శీకోటి అప్పలకొండ, కొప్పనాతి నాగ కుమారి, ఒమ్మి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.





వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



పిహెచ్‌సి డాక్టర్ జగదీష్ కృష్ణ

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వేసవి ఎండ తీవ్రత అధికంగా నమోదు అవుతున్న దృష్ట్యా సీతానగరం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ఆర్.జగదీష్ కృష్ణ ప్రజలకు కొన్ని సూచనలు, సలహాలు అందజేశారు. ప్రజలందరూ ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 4 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో తిరగరాదని, నీడ పట్టునే ఉంటూ ఓఆర్ఎస్ ద్రావణం,పళ్ళ రసాలు, పలుచని మజ్జిగ తీసుకుంటూ మషాలా దినుసులు లేని సాత్వికాహారం తీసుకోవాలని మద్యపానం ధూమపానం మానుకోవాలని బయటకు వెళ్ళేటప్పుడు తలపై గొడుగు లేదా టోపీ గాని ధరించాలని, లేత రంగు పలుచని కాటన్ వస్త్రాలు ధరించాలని తెలియజేశారు. ఎవరికైనా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే అనగా అధిక జ్వరము, అధిక దాహం, వాంతులు లేదా వికారం ఉంటే వెంటనే వారిని నీడగా ఉన్న చల్లని ప్రదేశానికి చేర్చి తడిబట్టతో ఒళ్లంతా తుడిచి వారికి సేద తీర్చి ఓ ఆర్ ఎస్ ద్రావణం తాగించి సాధ్యమైనంత తొందరగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కానీ తీసుకొచ్చి చికిత్స అందించాలని తెలియజేశారు.

# రోడ్ ప్రమాదాల నివారణకు సీఐ సురేష్ చర్యలు




ప్రమాదకర కూడళ్లలో బారికేడ్లు, డ్రమ్ముల ఏర్పాటు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో ప్రధాన రోడ్డు ప్రమాదాల కూడళ్ళలో రోడ్డు ప్రమాదాల నివారణకు మండపేట టౌన్ సీఐ డీ సురేష్ చర్యలు చేపట్టారు.పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాలు జరిగే అవకాశమున్న ప్రధాన జంక్షన్ల వద్ద మూవబుల్ బారికేడ్లు (స్టాపర్లు) డ్రమ్ములను ఏర్పాటు చేశారు. పెదపర్తి రేవు, విజయలక్ష్మి నగర్ బైపాస్, సంఘం కాలనీ జంక్షన్ బైపాస్ వద్ద వాటిని ఏర్పాటు చేశారు. అలాగే ఏడిద జంక్షన్ బైపాస్, ఆలమూరు రోడ్డులోని టోల్ గేట్, ఆదిత్య కాలేజ్ జంక్షన్ ల వద్ద కూడా బారికేడ్లు, డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, వాహనాల వేగాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.

# కౌలు రైతులు కార్డులు కొరకు దరఖాస్తు చేసుకోండి

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలంలో కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు కౌలు కార్డులు (సిసిఆర్‌సి కార్డులు) కొరకు దరఖాస్తు చేసుకొనవలసినదిగా కోరడమైనది. సదరు దరఖాస్తు నందు సదరు కౌలు రైతు ఏ రైతు వద్ద భూ యజమాని గల భూమిని సాగు చేస్తున్నారు, సదరు భూమి వివరములు, ఆధార్ కార్డు మరియు పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్ మొదలగు వివరములు జతపరచి సదరు దరఖాస్తును కౌలు రైతు ఏ గ్రామంలో వ్యవసాయం చేస్తున్నారో ఆ గ్రామంలో గల వీఆర్వో, విఎఎ (గ్రామ వ్యవసాయ సహాయకుడు)లకు అందజేసి కౌలు కార్డు పొందవలసిందిగా తెలిపారు.

మత్తు పదార్థాల వినియోగంతో

# యువత భవిష్యత్తు నాశనం

మండపేట రూరల్ సీఐ ఆధ్వర్యంలో 'కనెక్ట్ యూత్' కార్యక్రమం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా మాచవరం - సోమేశ్వరం సెంటర్‌లో శుక్రవారం 'కనెక్ట్ యూత్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు ఆధ్వర్యంలో, రాయవరం ఎస్సై డి. సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ దొరరాజు మాట్లాడుతూ ప్రస్తుతం యువతలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోందని, ఇవి వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదం ఉందని వివరించారు. మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. అవగాహన కోసం ప్రొజెక్టర్ స్క్రీన్ ఏర్పాటు చేసి పలు వీడియోలను ప్రదర్శించారు. యువత గంజాయి, మద్యం, క్రికెట్ బెట్టింగ్, పేకాట వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సీఐ దొరరాజు కోరారు.

దళిత, గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల

# అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత, గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ దళిత ఎంటర్ప్రెన్యూస్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పినమాల నాగకుమార్ విజ్ఞప్తి చేశారు. దేశంలో, రాష్ట్రంలో దళిత, గిరిజన పట్ల బ్యాంకర్ల ఆలోచన విధానంలో మార్పు రానంతవరకు ఎన్ని సదస్సులు నిర్వహించిన వారి ఆర్థిక అభివృద్ధి సాధ్యం కాదని, కాగితాలకే పరిమితం అవుతుందని నాగ కుమార్ వాపోయారు. స్థానికంగా షల్టన్ హోటల్ లో మినిస్ట్రీ ఆఫ్ ఎమ్మెస్ఎం ఈ కేంద్ర ప్రభుత్వం విభాగం ఆధ్వర్యంలో వెండర్ డెవలప్మెంట్ అవగాహన నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ వెండర్ డెవలప్మెంట్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి శివ శంకర్ రావు కి, జోనల్ హెడ్ వి. సురేష్ బాబులకు రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సమస్యలను పరిష్కరించాలని నాగ కుమార్ వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మీడియా తో రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలను జన జీవన ప్రవంతిలో ఆర్థికంగా బలవంతులను చేయడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు తీసుకొస్తున్నప్పటికీ బ్యాంకర్లు సహకరించడం లేదని అన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఆర్థిక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ బడ్జెట్ కేటాయింపులను ఇతర పథకాలకు మళ్లిస్తూ దళిత,గిరిజనులకు మొండి చేయి చూపిస్తున్నాయని వాపోయారు. గత వైసీపీ ప్రభుత్వం లో నిధులు దారి మల్లాయని, కూటమి ప్రభుత్వం కూడా ఈ రెండేళ్లలోనూ దళిత, గిరిజన కార్పొరేషన్ల కు నిధులు కేటాయింపులు జరగలేదన్నారు. బ్యాంకర్ల వద్దకు పూర్తి డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తో వెళ్ళినప్పటికీ ప్రాజెక్టు వయాబిలిటీ లేదని, కేటాయించిన బడ్జెట్ అయిపోయిందని దళిత,గిరిజన ఔత్సాహికుల పట్ల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నాయని వాపోయారు. రాష్ట్రంలో ఎస్సీ ,ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను తయారు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక విభాగం ద్వారా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన విధంగా ఇంటికొక పారిశ్రామికవేత్త తయారవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. నేషనల్ ఎస్సి ,ఎస్టీ హబ్ సేవలు రాష్ట్రంలో అందించేందుకు ప్రాధాన్యత కార్యలయం, టెక్నికల్ సెంటర్ ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక రంగాలలో, ప్రభుత్వ పథకాలలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంకు రుణాలు పొందేందుకు తగిన టెక్నికల్ సహకారం కార్పొరేషన్ ద్వారా అందించాలని ఆంధ్రప్రదేశ్ దళిత అంతర్ప్రె న్యూర్స్ ఎంపర్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు పినమాల నాగ కుమార్ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఏపిడిఈఈఏ ఉపాధ్యక్షులు జోన్సీ, కోయా వెంకటరావు, రత్న రాజు, దేవరపల్లి శాంతికుమార్, శేఖర్ చొల్లా తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహకారం

గోంగూరలంకను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు
గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు పరిశీలన - ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి





**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని స్థాయిల్లో చర్యలు చేపడుతోందని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గంలోని వాడపల్లి సమీప గోంగూరలంక ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ముఖ్యమంత్రితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఘాట్ల ఆధునికీకరణ, రహదారుల విస్తరణ, యాత్రికులకు అవసరమైన సౌకర్యాల కల్పన వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు. పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించినట్లు వెల్లడించారు. గోంగూరలంక ప్రాంతాన్ని పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చేసే క్రమంలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.స్థానిక శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు ఆలోచన చెయ్యడం ద్వారా గోంగూర లంక ప్రాంతంలో క్షేత్ర స్థాయిలో పరిశీలనా చేయడం జరిగింది అని తెలిపారు. థీమ్ పార్కు కోసం ముందుకు వొచ్చిన ప్రతినిధులు ఆలోచన చెయ్యడం వల్ల వాస్తవ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలనా చేయడం కోసం అధికారులతో కలిసి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. గోదావరి నదీ మధ్యలో ఉండటం వల్ల ఇక్కడి నేల స్వభావం, పర్యావరణ పరిస్థితులు, అభివృద్ధి అవకాశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. అన్ని అంశాలు అనుకూలిస్తే పుష్కరాల నాటికి ఈ ప్రాంతంలో ప్రత్యేక థీమ్ పార్కును అభివృద్ధి చేయాలనే ఆలోచన ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. మరో 15 నుంచి 20 రోజుల్లో సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గోంగూరలంక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పుష్కరాల సందర్భంగా దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్, పర్యాటక శాఖల సమన్వయంతో గోంగూరలంక ప్రాంతంలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలపై అధ్యయనం చేసి, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ పర్యటనలో టూరిజం ప్రాంతీయ సంచాలకులు ఎన్‌వీవీఎస్ఎన్ మూర్తి, గోదావరి హెడ్‌వర్క్స్ ఈఈ జి.శ్రీనివాసరావు, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటచలం, తహసీల్దార్ డి.దుర్గాప్రసాద్, ఎంపీపి కాకర్ల నారాయుడు, స్థానిక నేతలు సూరపని సూర్య భాస్కర రామ్మోహన్, బేతిన నారాయణ, సుంకర సత్తిబాబు, బొడపాటి వెంకట ముత్యాలరావ్, కాకర్ల బ్రహ్మాజీ, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి కార్యాలయంలో "జనతావారధి"




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మీ సమస్య... మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమాన్ని స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి వినుతులను స్వీకరించారు. వృద్ధాప్య పింఛన్లు మరియు వితంతు పెన్షన్లు, కాతేరులో లో ఓల్టేజి సమస్య, డ్రైనేజీ తదితర సమస్యలపై పలు వినతిపత్రాలు వచ్చాయి. ఈరోజు వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. జనతా వారధి కన్వీనర్ శివరామకృష్ణంరాజు, కో కన్వీనర్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్, మీనాక్షి రెడ్డి, స్వామి సూర్య కిరణ్, మల్లిడి సుబ్బలక్ష్మి. బాబ్జి మాస్టర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 21, 22, 23 తేదీల్లో

# "సమాధాన్ సమరోహ్" నిర్వహణ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులోకి"అనే లక్ష్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో,గౌరవ సుప్రీం కోర్టు ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న "సమాధాన్ సమరోహ్" ఆగస్టు 21, 22, 23 తేదీల్లో నిర్వహించ నున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలియ చేశారు. "సమాధాన్ సమరోహ్" మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం మరియు దేశవ్యాప్తంగా వివాదాలలో సామరస్య సాధన కోసం భారత సుప్రీం కోర్టు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా, గౌరవ సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న రాజీపడదగిన కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించ బడనున్నదని తెలియ జేయడమైనది. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం ఆగస్టు 21,22, 23 తేదీలలో గౌరవ సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, కక్షిదారులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని తమ కేసులను పరస్పర అవగాహనతో రాజీమార్గం ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కోరింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కక్షిదారులు, సంబంధిత న్యాయవాదులు మరిన్ని వివరాల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలియ జేశారు.వాల్ప్ లైన్ నెంబర్లు:

వేసవి దృష్ట్యా విద్యుత్ సమస్యలను

# తక్షణమే పరిష్కరించండి : బత్తుల

యంత్రపరికరాల రాయితీలపై రైతులు అవగాహన - బత్తుల ఆధ్వర్యంలో ఉపాధి శ్రామికులకు మజ్జిగ పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజ కవర్గంలో తీవ్ర వేసవి, అధిక లోడుల దృష్ట్యా విద్యుత్ ట్రాన్స్ఫా ర్మర్లు చాలా చోట్ల దెబ్బతింటు న్నయని, వాటి స్థానంలో కొత్త ట్రాన్స్ఫార్మర్ వెంటనే ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను వెం టనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని రాజానగరం శాసనసభ్యులు బత్తల బలరామకృష్ణ విద్యుత్ శాఖ అధికారులకు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అశోక్ కుమార్ ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గ స్థాయిలో శాఖల వారీగా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి కోట్లాది నిధులు వెచ్చించమని, అధికారుల తీరు బాగానే ఉందని అయితే తీవ్ర వేసవి, ఓవర్ లోడ్ లు కారణంగా విద్యుత్ ట్రాన్స్ఫారం దెబ్బతింటున్నాయన్నారు. విద్యుత్ సమస్యలు ఎక్కడ ఉన్న వెంటనే పరిష్కరించి, ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. నియోజకవర్గంలో నూతన డ్రైనేజీల నిర్మాణం, సిసి రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, డిజిటల్ లైబ్రరీల పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఏ గ్రామాల్లో అయినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే తనకు తెలియజేస్తే మరో కాంట్రాక్టర్లతో నిర్మాణాలు త్వరగా పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ అధికారులకు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులు పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు తెలియజేస్తూ, ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న యంత్రపరికరాలపై కూడా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులను పామ్ ఆయిల్ తో పాటు అంతర్ పంటలు, కూరగాయల పంట సాగులో రాయితీలు ప్రతి గ్రామంలో తెలియజేయలన్నారు. వేసవి దృష్ట్యా నియోజకవర్గంలోని మూడు మండలాలలో పనిచేస్తున్న ఉపాధిహామీ శ్రామికులకు పది రోజులు పాటు ఉచిత మజ్జిగ పంపిణీ చేయాలని జనసేన పార్టీ నాయకులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు అడ్డాల శ్రీను, మేడిశెట్టి శివరాం, అడపా శ్రీనివాస్, కిమిడి శ్రీరామ్, నాతిపాం దొరబాబు, వేగిశెట్టి రాజు, యర్రంశెట్టి పోలారావు, ముక్క రాంబాబు, బద్దిరెడ్డి దొర, కర్రి గణేష్, వివిధ శాఖలఅధికారులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై బాల బాలికలకు అవగాహన




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 40వ వార్డు సీతంపేట -1,2 అంగన్వాడి సెంటర్లలో కిషోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిపీ యూనిట్ కౌన్సిలర్ సి హెచ్ అబ్షాలోమ్,ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ ఆర్.బేబిరాణి, ఎంఎస్‌కె.లావణ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషోర్ బాలబాలికలకు ఆర్థిక అక్షరాస్యత గురించి వివరించారు. పొదుపు అంటే ఏమిటి? పొదుపు ఎలా చేయాలి? అవసరాలకి,విలాసాలకి మధ్య తేడాను సవివరంగ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ ఎస్.వరలక్ష్మి, హెల్పర్ కామేశ్వరి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

### చిరంజీవి, మహేష్ రిజెక్ట్ చేసిన కథతో ప్రభాస్ సినిమా..

# కట్ చేస్తే.. డార్లింగ్ కెరీర్‌లోనే డిజాస్టర్





ఈ ఏడాది ది రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకులను పలకరించాడు ప్రభాస్. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్ లో స్పిరిట్ అనే మరో పాన్ ఇండియా మూవీ చేస్తున్నాడు డార్లింగ్. దీంతో పాటు ఫౌజీ, సలార్ 2, కల్కి 2 సినిమాలు కూడా ప్రభాస్ కంప్లీట్ చేయాల్సి ఉంది. పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆ మధ్యన సందీప్ రెడ్డి వంగా చెప్పినట్లు ఇండియన్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ అన్న ట్యాగ్ కు ప్రభాస్ అన్ని విధాలా అర్హుడు. ప్రస్తుతం ప్రభాస్ క్రేజ్ చేస్తోన్న ప్రాజెక్టులను చూస్తుంటే సందీప్ రెడ్డి చెప్పింది కరెక్టే అని పిస్తోంది. బాహుబలి సినిమాతో పాన్ ఇండియా పదాన్ని పరిచయం చేసిన ప్రభాస్ సాహో, సలార్, కల్కి సినిమాలతో అందనంత ఎత్తుకు ఎదిగపోయాడు. ది రాజా సాబ్ కొంచెం నిరాశపర్చినా ఇప్పుడు ప్రభాస్ చేతిలో ఉన్న సినిమాల లైనప్ చూస్తే మైండ్ బ్లాక్ అవ్వుద్ది. హను రాఘవపూడి ఫౌజీ, సందీప్ రెడ్డి వంగా స్పిరిట్‌లతో పాటు సలార్ 2, కల్కి 2 సినిమాలు డార్లింగ్ పూర్తి చేయాల్సి ఉంది. అలాగే మరికొందరు స్టార్ డైరెక్టర్లు కూడా ప్రభాస్ తో సినిమా చేయడనికి క్యూలో ఉన్నారు. అయితే చాలా మంది హీరోల్లాగే ప్రభాస్ కెరీర్ లోనూ కొన్ని ఫ్లాప్ సినిమాలు ఉన్నాయి. అందులో ఓ సినిమా అయితే కచ్చితంగా ఫ్లాప్ అవుతుందని ముందే తెలిసినా డేర్ చేశాడు ప్రభాస్. మెగాస్టార్ చిరంజీవి, సూపర్ స్టార్ మహేష్ లాంటి స్టార్ హీరోలు సైతం ఆ సినిమా కథ విని వెనక్కు తగ్గారు. కానీ ప్రభాస్ ధైర్యం చేశాడు.. కట్ చేస్తే.. ఆ సినిమా డార్లింగ్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ డిజాస్టర్స్ లో ఒకటిగా నిలిచిపోయింది. ఆ సినిమా మరేదో కాదు చక్రం. క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ తెరకెక్కించిన చిత్రం చక్రం. ఇందులో ప్రభాస్ నటన అద్భుతంగా ఉంటుంది. కొన్ని చోట్ల కన్నీళ్లు కూడా తెప్పిస్తాడు. కానీ ఈ సినిమాలో ఎలాంటి మాస్ ఎలిమెంట్స్ ఉండవు. పైగా ఈ మూవీ క్లైమాక్స్ లో ప్రభాస్ చనిపోతాడు. అందుకే అభిమానులు చక్రం సినిమాను పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఈ సినిమా ఛాన్స్ ముందుగా మెగాస్టార్ చిరంజీవి వద్దకు వెళ్లిందట. కానీ ఆయన పెద్దగా ఇంట్రెస్ట్ చూపించలేదట. ఆ తర్వాత మహేష్ బాబు వద్దకు వెళ్లినా సేమ్ సిచ్యువేషన్. దీంతో కృష్ణవంశీ చివరకు ప్రభాస్ తో ఈ సినిమా చేసి డేర్ చేశారని సమాచారం. అయితే ఈ సినిమా డిజాస్టర్ గా మిగిలినా ప్రభాస్ కెరీర్ లో ఓ డిఫరెంట్ మూవీగా నిలిచిపోయింది. ముఖ్యంగా జగమంత కుటుంబం నాది సాంగ్ అయితే చార్ట్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమాలో ఆసిన్, ఛార్మి, ప్రకాశ్ రాజ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు.


# తెలుగు హీరోలలో అతడు సంథింగ్ స్పెషల్..

ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభు దేవా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సినీ రంగంలో నటుడిగా, దర్శకుడిగా, కొరియోగ్రాఫర్ గా తనదైన ముద్ర వేశారు. ప్రరస్తుతంహిందీలో వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆయన.. గతంలో ఓ ఇంటర్వ్యూలో టాలీవుడ్ హీరోల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇప్పుడు ఆ కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి. ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకుడు ప్రభుదేవా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తెలుగులో హీరోగా, నటుడిగా, దర్శకుడిగా, కొరియోగ్రాఫర్ గా తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకున్నారు. అటు డ్యాన్స్, ఇటు కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఒకప్పుడు సౌత్ ఇండస్ట్రీలో వరుస సినిమాలను తెరకెక్కించిన ఆయన.. ఇప్పుడు హిందీలో బిజీగా ఉంటున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో ప్రభు దేవా మాట్లాడుతూ.. తెలుగు చిత్ర పరిశ్రమలోని ప్రస్తుత తరం నటుల డాన్స్ నైపుణ్యాలపై ప్రశంసలను కురిపించారు. అందులో ప్రభుదేవా మాట్లాడుతూ ఆయన జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి హీరోల అద్భుతమైన డాన్స్ ప్రతిభ గురించి మాట్లాడారు. ప్రభుదేవా మాట్లాడుతూ.. నేటి తరం యువ హీరోలు, ముఖ్యంగా జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి వారు అద్భుతంగా డాన్స్ చేస్తున్నారని, వారి డాన్స్ నైపుణ్యాలు నెక్స్ట్ లెవెల్లో ఉన్నాయని అన్నారు. తనను ఒకరిని దృష్టిలో పెట్టుకుని డాన్స్ కంపోజ్ చేయమంటే, అది చాలా క్రియేటివ్‌గా ఉంటుందని చెప్పారు. తాను జూనియర్ ఎన్టీఆర్‌తో సాంబా అనే ఒకే ఒక పాటలో పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ఆ పాటలో ఎన్టీఆర్ డాన్స్ సూపర్... హి ఈజ్ సంథింగ్ ఎల్స్ అని ప్రభుదేవా ప్రశంసించారు. అల్లు అర్జున్‌తో ఇటీవల ఒక వాణిజ్య ప్రకటనకు పనిచేశానని, కానీ ఆ ప్రకటనలో ఆయన డాన్స్ కొరియోగ్రఫీ చేసే అవకాశం రాలేదని వివరించారు. అయితే, టీవీలో అల్లు అర్జున్ డాన్స్ చూసినప్పుడు అది ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత తెలుగు చిత్ర పరిశ్రమలో డాన్స్ అనేది హీరోలకు ఒక ప్రాథమిక అర్హతగా మారిందని ప్రభుదేవా అన్నారు. ఒక హీరో అంటే పోరాటాలు చేయడంతో పాటు డాన్స్ కూడా చేయగలగాలి అనే స్థాయికి వచ్చిందని వివరించారు.





# అబ్బబ్బా.. గ్లామర్ ఫోజులతో సీరియల్ బ్యూటీ..



ప్రస్తుతం సోషల్ మీడియాలో సినీతారలు ఎంత యాక్టివ్‌గా ఉంటున్నారో చెప్పక్కర్లేదు. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ నెట్టింట తెగ హడావిడి చేస్తుంటారు. తాజాగా ఓ సీరియల్ బ్యూటీ షేర్ చేసిన ఫోటోస్ చూసి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఆ వయ్యారి గ్లామర్ సొగసులు, ఫోజులు చూసి క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు ప్రియా హెగ్డే. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ అందాల భామ, తన నటనతో , హోమ్లీ లుక్స్‌తో తెలుగు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా 'కేరాఫ్ అనసూయ' సీరియల్ ద్వారా ఈమె తెలుగు ఇంట్లో ఒకరిగా మారిపోయింది. ఈ సీరియల్‌లో తన అద్భుతమైన నటనతో, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకుంది. కేవలం సీరియల్స్ మాత్రమే కాకుండా కన్నడ, తెలుగు భాషల్లో కొన్ని సినిమాల్లోనూ నటించి మెప్పించింది. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉండే ప్రియా హెగ్డే, నిరంతరం సరికొత్త ఫోటోషూట్‌లను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. మోడ్రన్ డ్రెస్సుల నుంచి ట్రెడిషనల్ వేర్ల వరకు ప్రతి అవుట్‌ఫిట్‌లోనూ ఈమె ఎంతో అందంగా కనిపిస్తుంది. తాజాగా ప్రియా హెగ్డే చీరకట్టులో పోస్ట్ చేసిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోషూట్‌లో ఆమె అచ్చ తెలుగు లక్ష్మిలా ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపిస్తూ కుర్రకారు గుండెల్ని కొల్లగొడుతోంది. ఈ లేటెస్ట్ ఫోటోలలో ప్రియా హెగ్డే ధరించిన చీర ఆమె నవ్వుకు, అందానికి మరింత వన్నె తెచ్చింది. గ్లామరస్ చీరకట్టుకు తగినట్లుగా సింపుల్ మేకప్, ఎలిగెంట్ జ్యువెలరీ , అందమైన జడతో ఆమె లుక్ చాలా స్టన్నింగ్‌గా ఉంది. ఆమె ఇచ్చిన ఫోజులు, హావభావాలు అభిమానులను ఎంతగానో మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఈ ఫోటోలు చూసిన నెటిజన్లు, ఫ్యాన్స్ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. "అచ్చమైన తెలుగు ఆడపిల్లలా ఉన్నావు", "శారీ లుక్‌లో నువ్వు దేవతలా ఉన్నావు", "బ్యూటిఫుల్ ఇన్ శారీ" అంటూ క్రేజీ కామెంట్స్ పెడుతూ లైకుల వర్షం కురిపిస్తున్నారు. ప్రియా హెగ్డేకు గ్లామర్ పరంగానే కాకుండా, నటన పరంగానూ మంచి గుర్తింపు ఉంది. ఆమె ఏ పాత్ర చేసినా అందులో ఒదిగిపోయే తీరు ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. అందుకే ఆమె ఫోటోలు సోషల్ మీడియాలోకి రాగానే క్షణాల్లో వైరల్ అవుతుంటాయి.

### రిటైర్మెంట్‌తో షాకిచ్చిన

# టీమిండియా 3డీ ప్లేయర్..

## సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్..!



శ్రీలంకలో జరిగిన నిదహాస్ ట్రోఫీ ద్వారా అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన శంకర్.. ఆ తర్వాత వన్డేల్లోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. హార్దిక్ పాండ్యాకు ప్రత్యామ్నాయంగా సెలెక్టర్లు ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించారు.

**2019 ప్రపంచకప్ టాపిక్.. ఆ 'త్రీడీ' ట్యాగ్..**

విజయ్ శంకర్ కెరీర్‌లో అత్యంత కీలకమైన ఘట్టం 2019 వన్డే ప్రపంచకప్. అప్పట్లో అద్భుత ఫామ్‌లో ఉన్న అంబటి రాయుడును పక్కనపెట్టి మరీ సెలెక్టర్లు శంకర్‌ను ప్రపంచకప్ జట్టులోకి ఎంపిక చేశారు. ఆ సమయంలో చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ ఆయనను 'త్రీ డైమెన్షనల్' (త్రీడీ) ప్లేయర్‌గా అభివర్ణించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడింటిలోనూ రాణించగలరని చెప్పిన ఆ మాట క్రీడా వర్గాల్లో పెద్ద సంచలనంగా మారింది. ఆ ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో తాను వేసిన తొలి బంతికే వికెట్ తీసి విజయ్ శంకర్ రికార్డు సృష్టించాడు. అయితే ఆ తర్వాత గాయం కారణంగా ఆయన టోర్నీ మధ్యలోనే నిష్క్రమించాల్సి వచ్చింది.

భారత ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ విరిటైర్మెంట్ నిర్ణయంతో ఒక విలక్షణమైన ఆల్‌రౌండర్ భారత క్రికెట్ ప్రయాణం ముగిసింది. తీవ్రమైన పోటీ ఉండే భారత క్రీడారంగంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన శంకర్.. తనదైన శైలిలో ముద్ర వేశాడు. భారత ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ క్రికెట్ అభిమానులకు ఊహించని షాక్ ఇచ్చాడు. అన్ని రకాల భారతీయ క్రికెట్ ఫార్మాట్లకు గుడ్‌బై చెపుతున్నట్లు ఆయన సంచలన ప్రకటన చేశాడు. అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు దేశవాళీ క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ప్రకటిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం ప్రస్తుతం క్రీడా ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

**సంచలన నిర్ణయం.. సోషల్ మీడియా వేదికగా ప్రకటన..**

తమిళనాడుకు చెందిన 35 ఏళ్ల ఈ స్టార్ ఆల్‌రౌండర్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా అధికారికంగా పంచుకున్నాడు. ఇన్నాళ్లూ తనకు మద్దతుగా నిలిచిన భారత క్రికెట్ నియంత్రణ మండలి, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్, తోటి ఆటగాళ్లు, కోచ్‌లు, అభిమానులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపాడు. మైదానంలో దేశం కోసం ఆడటం తన జీవితంలో మరువలేని అనుభూతిని ఇచ్చిందని, ఈ ప్రయాణంలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని విజయ్ శంకర్ ఎమోషనల్ అయ్యాడు.

**ఆ నిలకడైన ప్రదర్శనే టీమిండియాలోకి తెచ్చింది..!**

దేశవాళీ క్రికెట్‌లో తమిళనాడు తరపున విజయ్ శంకర్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. మిడిలార్డర్‌లో నమ్మకమైన బ్యాటింగ్‌తో పాటు, మీడియం పేస్ బౌలింగ్‌తో జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. ఈ నిలకడైన ఆటతీరే ఆయనకు జాతీయ జట్టులో చోటు సంపాదించి పెట్టింది. 2018లో

**ఐపీఎల్‌లోనూ తనదైన ముద్ర..**

భారత దేశవాళీ లీగ్ ఐపీఎల్‌లోనూ విజయ్ శంకర్ సుదీర్ఘ కాలం పాటు కొనసాగాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ డేర్‌డెవిల్స్, గుజరాత్ టైటాన్స్ వంటి జట్లకు ఆయన ప్రాతినిధ్యం వహించాడు. ముఖ్యంగా గుజరాత్ టైటాన్స్ జట్టు టైటిల్ గెలవడంలో, తర్వాతి సీజన్‌లో రన్నరప్‌గా నిలవడంలో మిడిలార్డర్ బ్యాటర్‌గా తనదైన శైలిలో రాణించాడు. ఒత్తిడి సమయంలో జట్టును ఆదుకుంటూ పలు కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. విజయ్ శంకర్ రిటైర్మెంట్ నిర్ణయంతో ఒక విలక్షణమైన ఆల్‌రౌండర్ భారత క్రికెట్ ప్రయాణం ముగిసింది. తీవ్రమైన పోటీ ఉండే భారత క్రీడారంగంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన శంకర్.. తనదైన శైలిలో ముద్ర వేశాడు. భారతీయ పిచ్‌లపై ఆట ముగిసినప్పటికీ, ఆయన భవిష్యత్తులో విదేశీ లీగ్‌లలో ఆడే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించబోతున్న విజయ్ శంకర్‌కు అభిమానులు సామాజిక మాధ్యమాల ద్వారా ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు.

# ఐపీఎల్‌లో మరో కొత్త ఫ్రాంచైజీ..

### ఒకే టీంలోకి ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ




ఐపీఎల్ 2026 సీజన్ సిక్సర్ల వర్షంతో క్రికెట్ ప్రియులను ఉర్రూతలూగిస్తోంది. ఈ ఉత్కంఠ భరిత పోరులో బీహార్ సంచలనం, 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీతో పాటు సన్‌రైజర్స్ హైదరాబాద్ తాత్కాలిక సారథి ఇషాన్ కిషన్ తమ అద్భుత బ్యాటింగ్‌తో సరికొత్త చరిత్ర సృష్టించారు. తాజాగా వీరిద్దరినీ ఒకే జట్టులో చూసేందుకు అడుగులు పడుతుండటం క్రీడాలోకంలో హాట్ టాపిక్‌గా మారింది. భారత క్రికెట్ రంగానికి ఎందరో మహానుభావులను అందించిన ఘనత బీహార్ గడ్డకు ఉంది. దేశంలోనే అత్యంత విజయవంతమైన కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ సైతం ఉమ్మడి బీహార్‌లోనే జన్మించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో బిహార్‌కు చెందిన ఎడమచేతి వాటం బ్యాటర్లు వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. కేవలం 15 ఏళ్ల వయసులోనే వైభవ్.. జస్ప్రీత్ బుమ్రా, పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లను భయపెడుతూ తానేంటో నిరూపించుకున్నాడు. మరోవైపు ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ముందుండి నడిపిస్తూ అగ్రెసివ్ బ్రాండ్ క్రికెట్‌ను పరిచయం చేశాడు. వీరితో పాటు గోపాల్‌గంజ్‌కు చెందిన సాకిబ్ హుస్సేన్ కూడా తన పదునైన బౌలింగ్‌తో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాడు.

**బీహార్‌కు సొంత ఐపీఎల్ టీమ్.. అనిల్ అగర్వాల్ డిమాండ్..**

బీహార్ క్రికెటర్ల అద్భుత ప్రదర్శన చూసిన ప్రముఖ పారిశ్రామికవేత్త, వేదాంత రీసోర్సెస్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు అనిల్ అగర్వాల్ సోషల్ మీడియా వేదికగా ఒక సంచలన ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ తరహాలోనే బీహార్‌కు కూడా ఒక ప్రత్యేకమైన ఐపీఎల్ జట్టు ఉండాలని ఆయన బలంగా ఆకాంక్షించారు. బీహార్ మట్టిలో ఎంతో మంది అసాధారణ క్రికెటర్లు ఉన్నారని, పాట్నాలో జన్మించిన ఇషాన్ కిషన్ వన్డేల్లో అత్యంత వేగవంతమైన ద్విశతకం సాధిస్తే, సమస్తిపూర్‌కు చెందిన వైభవ్ అత్యంత పిన్న వయసులోనే ఐపీఎల్‌లోకి అడుగుపెట్టి చరిత్ర సృష్టించాడని కొనియాడారు. బీహార్‌కు సొంత జట్టు వస్తే ఇక్కడి యువతకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.

**ఐపీఎల్‌లో కార్పొరేట్ సంస్థల జోరు.. కొత్త ఫ్రాంచైజీగా బీహార్?**

ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీల విలువ ఆకాశాన్ని తాకుతోంది. ఇటీవల రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును ఆదిత్య బిర్లా గ్రూప్ కన్సార్టియం సుమారు 16,706 కోట్ల రూపాయలకు కొనుగోలు చేయగా, రాజస్థాన్ రాయల్స్ జట్టును లక్ష్మీ మిట్టల్ కుటుంబం, అదార్ పూనావాలా గ్రూప్ కలిసి 15,660 కోట్ల రూపాయల భారీ మొత్తానికి దక్కించుకున్నాయి. గతంలో ఎనిమిది జట్లు ఉన్న ఐపీఎల్‌ను బీసీసీఐ పది జట్లకు విస్తరించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో లీగ్‌ను మరింత విస్తరించాలని బీసీసీఐ భావిస్తే, బీహార్‌కు చెందిన బిలియనీర్ అనిల్ అగర్వాల్ కొత్త జట్టును కొనుగోలు చేసేందుకు ప్రధాన పోటీదారుగా నిలిచే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, సాకిబ్ హుస్సేన్ వంటి బిహార్ బిడ్డలంతా తమ సొంత రాష్ట్ర జట్టు తరపున కలిసి ఆడే రోజులు ఎంతో దూరంలో లేవు. బీహార్ క్రికెట్ ప్రతిభకు ప్రపంచ వేదికపై గుర్తింపు తేవాలనే అనిల్ అగర్వాల్ ఆలోచన అద్భుతమైనది. ఒకవేళ బీహార్‌కు సొంత ఐపీఎల్ ఫ్రాంచైజీ దక్కితే, అది దేశీయ క్రికెట్‌లోనే కాకుండా ఆ రాష్ట్ర క్రీడా రంగంలో ఒక సరికొత్త విప్లవానికి నాంది పలుకుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్ SUCCESS
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com